

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 14 | సంచిక : 08 | ఏప్రియల్ 2009



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

పడమరవిప్పర్రు ..... 17-01-09
చించినాడ ........... 05-02-09
భద్రాచలం ........... 30-01-09
అమలాపురం ....... 25-01-09

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-01-09, పడమరవిప్పర్రు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన మనస్సుని మనం నిగ్రహించుకోవటం ప్రపంచములో అన్నింటికంటే కష్టమైనపని అని ఆచార్యులవారు చెప్పారు. మీరు స్నేహం చేసేటప్పుడు అన్ని కోణాలు పదిసార్లు ఆలోచించకుండా ఆ స్నేహం చేయకండి. ఒకవేళ ఆ స్నేహం వదిలేయవలసి వస్తే వందసార్లు ఆలోచించుకొని వదిలేయండి. మీరు ఎవరితోటి పోల్చుకోవద్దు. అలా పోల్చుకొంటే మీకు పాపం వస్తుంది. ఈ జీవకోటినంతా సమానం చేసినా మళ్ళీ నాలుగేళ్లలో హెచ్చుతగ్గులు వచ్చేస్తాయి. నాలుగు రూపాయిలు సంపాదించుకొనేవారు ఉంటారు, పాడుచేసుకొనేవారు ఉంటారు. మనచేతివేళ్ళే సమానంగా లేవు. కాబట్టి మీ సంసారాన్ని బట్టి మీరు ఉండండి. మీ చీరకి జాకెట్టు మేచింగు కుదురుతోందో లేదో చూచుకొంటారు అలాగే మీ మాటకి మీరు చేసే పనికి మేచింగు ఉందో లేదో చూసుకోండి. మీ మాటకి మీరు చేత్తోటి చేసే పనికి మేచింగు కుదరనప్పుడు నోరుమూసుకొని కూర్చోండి. ఎవరి మనస్సు అయితే నిర్మలంగా ఉంటుందో, ఎవరికైతే పవిత్రత ఉంటుందో వారు ఏదైనా ఇస్తే మీరు స్వీకరించండి. లోపల శాంతచిత్తం లేనప్పుడు, లోపల పవిత్రత లేనప్పుడు, లోపల యోగ్యత లేనప్పుడు మీకు రవికల గుడ్డ ఇచ్చినా పుచ్చుకోవటం మంచిదికాదు. ఏదో వంపుపెట్టి మర్యాదగానే తిరస్కరించండి, లోపల యోగ్యత ఉంటే ఇచ్చేవాడికి ఏమీ లేకపోయినా బాహ్యంగా వాడు అరటిపండు ఇచ్చినా సంతోషంగా స్వీకరించండి అని ఆచార్యులవారు చెప్పారు. మనం ఏపనిచేసినా, ఏ మాట మాట్లాడినా

ఈశ్వరానుగ్రహం సంపాదించుకోవటం ముఖ్యం. కాశీ ఎలా వెళ్ళాలో చాలామంది తెలుసుకుంటారు. కాని గెడప దాటి వెళ్ళలేరు అలాగే మీరు అందరూ అది చదివి, ఇది చదివి అలా చెయ్యాలి, ఇలా చెయ్యాలి అనుకోవటమేకాని ఆత్మజ్ఞానం పొందటానికి ప్రయాణం చేసే వాళ్ళు లేరు. భక్తిగ్రంధాలు చదివి మోక్షకాంక్షలేనివాళ్ళు అందరూ అటువంటివాళ్ళే. పుస్తకాలలో మోక్షంలేదు, మీ హృదయంలో ఉంది. ఎవరైనా ప్రయత్నం చేసి గెడపదాటివెళ్ళినా కాశీ చేరుకునేవాళ్ళు బహుకొద్దిమంది ఉంటారు. ఏమైనా ఆటంకాలు ఉంటే వెనక్కి వచ్చేస్తారు. ఈ ఆటంకాలు అన్నీ తట్టుకొని కాశీ వెళ్ళేవాళ్ళు వెయ్యికి ఒక్కళ్ళో ఇద్దరో ఉంటారు. అలాగే సాధన చేసేవాళ్ళే తక్కువ. సాధన చేసేవాళ్ళలో ఒక్కళ్ళో ఇద్దరో తప్పించి ఆత్మానుభవం పొందలేరు.

రూపబుద్ధి, నామబుద్ధి ఈ రెండూ జీవుడికి హద్దులు. జీవుడు ఈ హద్దులలో ఉంటాడు. అందుచేత మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తే దుఃఖం వస్తోంది, స్తోత్రం చేస్తే పొంగు వస్తోంది. దేహము నేను అనే బుద్ధిలోంచే ఆ రెండూ వస్తాయి. ఈ రెండు హద్దులు దాటకుండా నువ్వు ఏ మార్గంలో ప్రయాణం చేసినా నీకు ఆత్మజ్ఞానం కలుగదు. పడమర విప్పర్రు దాటకుండా భీమవరం ఎలాగ వెళ్ళగలం. భీమవరం వెళ్ళాలంటే ఈ ఊరు దాటాలికదా, అలాగే ఆత్మజ్ఞానం సంపాదించాలి అంటే ఈ హద్దులు రెండూ దాటాలి. భక్తులు జ్ఞానమార్గంలో వెళ్ళినా, భక్తిమార్గంలో వెళ్ళినా, కర్మమార్గంలో వెళ్ళినా ఈ నేనుని అతిక్రమించాలి. భక్తులు సాధన చెయ్యటానికి ఎవరి తిప్పలు వారు పడుతున్నారు, సాధన చాలా గొప్పగా చేస్తున్నారు. కాని వాడి రూపం చుట్టూ, వాడి నామంచుట్టూ తిరుగుతున్నారు. ఏదైతే నువ్వు నేను నేను అంటున్నావో ఆ తలంపు విడిచిపెట్టి ఆ తలంపు వెనకాల ఉన్నటువంటి చైతన్యాన్ని నువ్వు అందుకోలేకపోతున్నావు. గానుగెద్దు అనుకుంటుంది గంటనుంచి తిరుగుతున్నాను విప్పర్రు వదిలేసి ఈపాటికి గణపవరం వచ్చేసివుంటాను అనుకుంటుంది. దానికి గంతలు విప్పేస్తే అది విప్పర్రులోనే ఉంటుంది. అలాగే మనం కూడా చాలా సాధనలు చేస్తున్నాము అనుకుంటాము కాని ఎక్కడ ఉన్నాము అంటే ఆ నేను చుట్టూ తిరుగుతూ ఆ నేను దగ్గరే పడి ఉంటాము. ఇది లోకం యొక్క పోకడ. ఇది మీ అనుభవానికి సరిపోతోందో లేదో చూసుకోండి. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహగతమైన నేనులోనుండి విడుదల పొందాలి. మీకు అప్పు ఉంది అనుకోండి ఆ అప్పు తీర్చటంకోసం మీరు వ్యవసాయం చేసో, వ్యాపారం చేసో, ఉద్యోగం చేసో ఎలా సంపాదించి అప్పు తీరుస్తున్నారు కదా అలా మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా ముందు ఈ నేనులోంచి బయటపడాలి.

మీరు ఎంతకాలమైతే జీవించి ఉంటారో అంతకాలం సత్‌కర్మ విడిచిపెట్టవద్దు. మనం నీళ్ళతోటి శరీరాన్ని ఎలా శుభ్రం చేసుకుంటామో అలా సత్‌కర్మ మనస్సుని బాగుచేస్తుంది. మనం ఏమి చెయ్యాలి అంటే మన పని మనం చేసుకోవాలి, అవసరంలేని విషయాలకి మనం వెళ్ళకూడదు. అవసరంలేని విషయాలకి మనం వెళుతూఉంటే అహంభావన చిక్కబడిపోతుంది. మనం ఎంతసేపు అహంభావన పల్చబడేటట్టు చూచుకోవాలి. నీ కుడిచెయ్యి చేసేపని ఎడమచెయ్యికి తెలియకూడదు అని ఏసుక్రీస్తు అన్నాడు. అంత నిరహంకారంగా, అంత నిరాడంబరంగా నువ్వు పని చెయ్యాలి. అప్పడు నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. నాకు మోక్షం ఎప్పడు వస్తుంది అని ఒకరు భగవాన్‌ని అడిగారు. నువ్వు చేసిన కర్మ ఖర్చు అయ్యాక వస్తుంది అన్నారు. దాని అర్థం ఏమిటి అంటే మనం ఫలకాంక్ష లేకుండా ఏ పనీ చెయ్యము. ఫలం కోరినప్పడు ఫలం వచ్చి తీరుతుంది మంచికి మంచీ వస్తుంది, చెడ్డకి చెడ్డా వస్తుంది, దేవునికంటే మేము భిన్నంగా ఉన్నాము, దేవుడిని కాదని మేము చాలా పనులు చేయగలం అని అనుకున్నప్పడు, మేము స్వతంత్రులం అని అనుకున్నప్పడు ఎత్తుకు ఎత్తు అనుభవించాలి. పుణ్యానికి పుణ్యం అనుభవించాలి, పాపానికి పాపం అనుభవించాలి. మనందరం ఉన్నాము. మన శరీరంతోటి సంబంధం లేకుండా, మనస్సుతోటి సంబంధం లేకుండా ఇప్పడు కూడా మనం ఉన్నాము. దేహంపోయిన తరువాత కూడా మనం ఉంటాము మనకి తెలుసున్నా ఉన్నాము, తెలియకపోయినా ఉన్నాము. ఏదైతే ఉందో అది ఉందని తెలుసుకోవటమే జ్ఞానం. అట్టిజ్ఞాని మాత్రమే నా స్వరూపాన్ని పొందుతాడు అని పరమాత్మ గీతలో చెప్పాడు. మీరు ఒక జ్ఞానికి నమస్కారం పెట్టారనుకోండి వాడు ఈశ్వరుని స్వరూపమై ఉన్నాడు కాబట్టి ఆ నమస్కారం ఈశ్వరుడికే అందుతుంది. మీకు దేహాభిమానం లేదు అనుకోండి మీకు ఎవరైనా నమస్కారం పెడితే ఆ నమస్కారం ఈశ్వరుడి పాదాల దగ్గరకి వెళ్ళిపోతుంది. వీరు నాకే పెట్టారు అని మీరు అనుకున్నప్పడు సంతోషం వస్తుంది కదా అప్పడు అది మీకే అందుతుంది అందుచేత సన్యాసులకి ఎవరైనా నమస్కారం పెడితే నారాయణ, నారాయణ అంటారు అంటే అర్థం ఏమిటి అంటే నువ్వు పెట్టే నమస్కారం నారాయణుడికి అందుగాక అని అర్థం.

కొంతమంది గుడిలో చేసేపని దేవుడిపని అనుకుంటారు. సమాజానికి ఉపయోగపడే పని చేస్తే అది లౌకికకర్మ అంటారు. ఈ ప్రపంచం ఉండగా మనం వచ్చాము మరల ఈ ప్రపంచం ఉండగా మనం చనిపోయి బయటకు వెళ్ళిపోతాము ఇలా వస్తూఉంటాము, వెళ్ళిపోతూ ఉంటాము. ఈ ప్రపంచం ఈశ్వరుడిది. నీ సొమ్ము నువ్వు ఎలా చూసుకుంటావో దేవుడు

తన సొమ్ము అలా చూసుకోడా నువ్వు ఎవడవు సమాజాన్ని ఉద్ధరించటానికి? ఈ ప్రపంచాన్ని గాలికి వదిలేస్తాడా? ఆయన సొమ్ము ఆయన బాగానే చూసుకుంటాడు. మీరు నాది నాది అనేది కూడా ఆయనదే. మీకు బ్రహ్మాత్మబుద్ధి కలిగాక ఇంతకాలం ఏదైతే నాది నాది అనుకున్నానో అది ఆయనదే అన్న సంగతి అప్పుడు తెలుస్తుంది. మీరు ఎవరికి ఏ సహాయ సహకారాలు చేసినా అది అంతర్యామిగా ఉన్న నారాయణుడికే అందుతుంది. మీరు ఎదుటి వాళ్ళకి ఉపకారం చేసినా అక్కడ పొందేది నారాయణుడే. అపకారం చేసినా అక్కడ పొందేది నారాయణుడే. నారాయణుడు అంతర్యామిగా లేకుండా ఒక్క శరీరం కూడా ఈ భూమి మీదకి రావటానికి వీలులేదు. డబ్బుకు చపలత్వం ఎక్కువ, అది ఒక కొంపని విడిచిపెట్టి ఇంకొక కొంపకి వెళ్ళిపోతుంది. నీ జేబులో డబ్బు అలా ఉంచుదామన్నా నిన్ను మాయచేసి ఆ డబ్బు నీకు తెలియకుండా ఇంకొకరి ఇంటికి వెళ్ళిపోతుంది. రాష్ట్రాలని విడిచిపెడతూ ఉంటుంది, ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి దొర్లించుకు వెళ్ళిపోతుంది. అందుచేత పెద్దలు అంటారు "ఓడలు బళ్ళు అవుతాయి, బళ్ళు ఓడలు అవుతాయి" అని. చాపల్యంతో కూడిన ధనాన్ని, కొంపలు మార్చే ధనాన్ని, వ్యక్తిని మార్చే ధనాన్ని నమ్ముకుని నువ్వు సుఖపడదాం అనుకుంటున్నావా పిచ్చివాడా అని ఆచార్యులవారు అన్నారు. నీకు డబ్బు ఉండనీ, చదువు ఉండనీ, నీకు మంచిబిడ్డలు ఉండనీ, పదిమేడలు ఉండనీ వాటితో తాదాత్మ్యం చెందకు. నువ్వు వాటితో తాదాత్మ్యం చెందితే దేహాభిమానం పెరిగిపోతుంది. నీకు ఒకవేళ ఆస్థి ఉన్నా నీది అనుకోకు దేవుడిది అనుకో.

ఎంత అవమానం వచ్చినా భక్తులు సహిస్తారు కాని లౌకికులు అది సహించలేరు. భక్తుడు ఎందుకు సహించగలడు అంటే వాడికి సహించేశక్తి భగవంతుడు ఇస్తాడు, లేకపోతే వాడు సహించలేడు. నీకు ఎప్పుడైనా అవమానం ఎదురైతే నువ్వు ఓర్పుగా ఉంటే, సహించటం నేర్చుకుంటే నీకు ఎప్పుడు, ఎక్కడ ఎలా ఇవ్వాలో దేవుడు నీకు బహుమానం ఇస్తాడు. సహించటం నేర్చుకుంటే హృదయం యొక్క లోతులు పెరుగుతాయి, నీ హృదయం యొక్క సౌందర్యము పెరుగుతుంది. భగవాన్ ఏమని చెబుతున్నారంటే దూళ్ళను వెనకాల కట్టిపెట్టి తోలుకెళ్ళటం ఒక పద్ధతి, వెనకాల కొట్టకుండా ఎదర తవుడు నీళ్ళు చూపించి, పచ్చగడ్డి చూపించినా అవి కూడా వచ్చేస్తాయి. ఇలా చాలా మార్గాలు ఉన్నాయి. సాధన పేరు మీద మీకు ఇబ్బంది లేకుండా, మీకు దెబ్బలు తగలకుండా మీకు పచ్చగడ్డి చూపించి తీసుకు వెళ్ళే ప్రయత్నం చేస్తున్నాము. సాధన కూడా అందరికీ ఇష్టం ఉండదు. ఒకవేళ మీరు సాధన చేస్తున్నా ఈ సాధన నేను చేస్తున్నాను టైర్ అయిపోతున్నాను అనే భావన మీకు లేకుండా గమ్యానికి తీసుకొనిపోవటానికి చూస్తున్నాము.

నది వెళ్ళి సముద్రంలో ఎలా కలుస్తుందో అలాగ మీరు ఏదిగా ఉన్నారో దానిలో మిమ్మల్ని ఐక్యం చెయ్యటానికి వెనకాల మిమ్మల్ని కొట్టటం మానేసి పచ్చగడ్డి చూపిస్తూ తోలుకెళ్ళటానికి చూస్తున్నాము.

జీవకోటిపట్ల సహృదయాన్ని ఎవడైతే చూపిస్తున్నాడో, తన శరీరాన్ని తాను ఎలా ప్రేమించుకుంటాడో అలాగ జీవకోటిని కూడా ఎవడైతే ప్రేమిస్తున్నాడో వాడు ఒక్కడు మాత్రమే పూజార్హుడు. వర్షం వస్తూ ఉంటే భూమి ఎలాగ తడుస్తుందో తన దయతోటి, తన అనుగ్రహంతోటి ఏ మనిషి అయితే ప్రపంచాన్ని తడుపుతున్నాడో వాడు మాత్రమే మనం పూజింపదగినవాడు అని ఆచార్యులవారు అన్నారు. నాకు మోక్షం ఎపుడు వస్తుంది అని అడిగితే, ఇపుడు ఎక్కడ ఉన్నావు, ఇప్పుడు కూడా నువ్వు మోక్షంలోనే ఉన్నావు. ఉన్నావన్న సంగతి నీకు తెలియకపోవటం వల్ల మోక్షంకోసం వెదుకుతున్నావు. కొంతమంది కళ్ళజోడు కళ్ళకి పెట్టుకుని పెట్టుకున్నామన్న సంగతి మరచిపోయి కళ్ళజోడుకోసం వెతుక్కుంటూ ఉంటారు. గురువు చేసేది ఏమిటంటే వెదుక్కోకువయ్యా నీ కళ్ళజోడు నీ కళ్ళకే ఉంది అంటే ఆ దొరికింది అంటాడు వాడికి దొరకటం ఏమిటి అంతకుముందు కళ్ళజోడు లేదా అంటే ఉంది, అంటే నీది నీకే పట్టి ఇస్తాడు అది గురువు చేసేపని. గురువు ఒకవేళ అదనంగా నీకు ఏదైనా ఇస్తే మరల అది కాలప్రవాహంలో పోతుంది. నీ దేహమే నువ్వు కానప్పుడు ఏది నీది అవుతుంది. అందుచేత మీకు ధనం ఉంది అనుకోండి, పాండిత్యం ఉంది అనుకోండి మీరు అది వేస్టు చేసుకోనక్కరలేదు. అది దేవునిది అనుకోండి. అది ఎవరికైనా ఇస్తే దేవునికే ఇచ్చాము అనుకోండి. మీరు సమ్‌బడీ కాదు, మీరు నోబడీయే. సమ్‌బడీ అనుకొని వ్యక్తిభావన పెంచుకుంటున్నాము. మనం దేవుడిని కాదని దేవుని సంకల్పానికి విరుద్ధంగా ఏమీ చేయలేము. మనకు అంతా దేవుడు సంపాదించి పెట్టిందే అయినా, నేను సంపాదించాను అనుకొంటాము. దేవుడు మనకి వివేకం ఇస్తే అది నేను సంపాదించాను అనుకుంటాను. ఇలా వ్యక్తిభావన పెంచుకుంటున్నాము.

దేవుని పట్ల అనురాగం, ఆప్యాయత ఎలా ఉండాలి అంటే మనం పిల్లల్ని ముద్దుపెట్టు కుంటాము అనుకోండి మొదటి ముద్దు ఆప్యాయంగా ముద్దుపెట్టుకుంటాము. అలా నాలుగుసార్లు ముద్దుపెట్టుకుంటే ఆ చివరి ముద్దు అంత తీపిగా ఉండదు. మొదటి ముద్దు ఎంత తీపిగా ఉంటుందో అంత తీపిగా, అంత అనురాగంతోటి, అంత ఆప్యాయతతోటి నన్ను స్మరించుకుంటూ ఉంటే నాకు నచ్చినపని మీరు చేస్తూ ఉంటే అలా చెయ్యగా, చెయ్యగా ఏ రకంగా అయితే మీరు సిద్ధిపొందుతారో దాని తాలుక బుద్ధి ఇస్తాను. మీ దేహబుద్ధితోటి నన్ను పట్టుకోలేరు. మీకు ఆత్మబుద్ధిని ప్రసాదిస్తాను అని పరమాత్మ చెప్పాడు. మీకు ఉన్న తెలివితేటలతోటి

భగవంతుడిని తెలుసుకోలేరు. ఆయన దయవల్ల ఆయన అనుగ్రహం వల్ల ఆయన తెలియబడాలి అనుకొన్నప్పుడు మాత్రమే ఆయన తెలియబడతాడు. మనం ఎవరికైనా ఒక బిస్కట్టు ఇస్తే ఆ బిస్కట్టు ఇచ్చినట్టు అందరికి తెలియాలి అనుకుంటాము. దేవుని అనుగ్రహం ఎలా ఉంటుంది అంటే దేవుని అనుగ్రహం మీ మీద వర్షిస్తూ ఉంటే మీ ప్రక్కవాళ్ళకి కూడా తెలియాలని ఆయన అనుకోడు, వాడు దేవుడు. ఈ చెయ్యి ఆ చెయ్యిని ముట్టుకున్నప్పడు ఆ టచ్ ఎలా తెలుస్తూ ఉంటుందో అలా దేవుని అనుగ్రహం వర్షించినపుడు మీ హృదయానికి తెలుస్తూ ఉంటుంది. మనం వెళ్ళలేని లోతులకి దేవుడు చెయ్యిపట్టుకొని తీసుకు వెళుతున్నాడు ఇదంతా దేవుని దయని నీకు తెలుస్తూ ఉంటుంది. ఆచార్యులవారు ఏమన్నారు అంటే గురువు అంటే ఆత్మసాక్షాత్కారం పొందినవాడు. గురువుని అగౌరవపరచేవాడు బాగుపడే అవకాశం లేదు. ఎందుచేతనంటే గురువు మీరు తరించేవరకూ జన్మజన్మలకు మిమ్మల్ని వెంటాడుతూ ఉంటాడు. దారిలో నడుస్తున్న గొఱ్ఱెలకంటె తప్పిపోయిన గొఱ్ఱె అంటె ఇష్టపడతాడు కాపలాదారుడు. కనబడే గొఱ్ఱెలకంటె కనబడని గొఱ్ఱెకోసం ఆ గొఱ్ఱె ఏమైపోయిందో అని ఏడుస్తాడు. మనం ఏమి చేస్తాము అంటే బావున్నవాళ్ళు మాచుట్టాలు చుట్టాలు అంటాము. ఎవరైనా చెడిపోతే చుట్టమైనా మా చుట్టముకాదు అంటాము. మనం తప్పిపోయిన గొఱ్ఱెను వదిలేస్తాము. తప్పిపోయిన గొఱ్ఱెను గురువు కాపాడతాడు.

గడ్డితాడులో ఒకో పరక ఒకో పరక తీసేస్తే ఇంక గడ్డితాడు అంటూ లేదు. మనస్సు అంటే మీ అలవాట్లు, మీ వాసనలు మనం రాబోయే జన్మలో ఎలా ఉంటాము ఇటువంటి ఊహలు, మీరు కల్పించుకున్న గొడవలు ఇవే మనస్సు. వీటిని తప్పిస్తే మనస్సు అంటూ ప్రత్యేకంగా ఏమీ లేదు. భగవాన్ దగ్గరకు ఒకరు వెళ్ళి ఈ మధ్యన మా మనస్సు బాగాలేదు అని అడిగితే మీ మనస్సుని నా చేతిలో పెట్టండి అనేవారు భగవాన్. అది ఉంటే కదా మీరు చూపించటానికి. ఇదంతా మీ ఇమేజినేషన్. అసలు మనస్సు అనేది నిజంగా లేదు. మనస్సు నిజంగా ఉంటే అది గాఢనిద్రలో కూడా ఉండాలికదా అనేవారు భగవాన్. ఆచార్యులవారు అన్నారు ఎవడు మోసకారి అంటే కొంతమంది భగవద్గీత, రామాయణం అవి చదువుతూ ఉంటారు. కాని అందులో ఒకటికూడా ఆచరించాలనే తలంపు కూడా వాళ్ళకి ఉండదు. వాళ్ళు రాత్రి పగలు పిండి రుబ్బినట్లు రుబ్బేస్తూ ఉంటారు. చదివేసి వదిలేస్తూ ఉంటారు. వాడు మోసకారి అని ఆచార్యులవారు అన్నారు. ఎందుచేతనంటే వాడికి పూర్వజన్మల్లో పుణ్యకర్మలేదు. ఊరికే వాడు అలవాటు కింద చదువుతాడు. చదివేసాము అయిపోయింది అనుకుంటాము అలాకాదు మీరు చదివిందే

మళ్ళీ చదువుతూ ఉండండి. దానిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి, అలా జీవించటానికి ప్రయత్నం చేయండి. అప్పుడు మీకు హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. బ్రహ్మములో ఏమీ లేదు అని అనుకోవద్దు పూర్వం అనేకమంది ఋషులు, పెద్దవాళ్ళు బ్రహ్మంను తెలుసుకోవటానికి రాజ్యాలు, సంపదలు విడిచిపెట్టివెళ్ళారు. బ్రహ్మంలో ఏమీ లేకపోతే అన్ని త్యాగాలు వాళ్ళు ఎందుకు చేస్తారు. మనం ఇంటి దగ్గర పిడకలు ఎండేసి వచ్చాము అనుకోండి. సడన్‌గా ఇప్పుడు వర్షం వస్తే మన పిడకలన్నీ తడిచిపోతున్నాయి అని అనిపిస్తుంది. అంటే మనం పిడకలని కూడా విడిచిపెట్టలేము. బుద్ధుడు రాజ్యం, సంపద విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. రోజుకి వెయ్యి ఆవులు పాలు పితికేవారు. ఆయన బయటకి వచ్చాకా నేను వెయ్యి ఆవులు పాలు ఇచ్చే కొంప విడిచిపెట్టాను అనే తలంపు కూడా రాలేదు బుద్ధుడుకి. మీరు మీ అమ్మాయికి ఎప్పుడైనా పదిరూపాయలు పెడితే అది జ్ఞాపకం వస్తూ ఉంటుంది. ఇంక మనకి శాంతి ఏమిటి? మనకి మోక్షం ఏమిటి? అసలు మనకి పాడుబుద్ధి ఉందని తెలియడంలేదు. మనకి పాడుబుద్ధి ఉందని మనకి తెలిస్తే బాగుచేసుకుందాము అని అనిపిస్తుంది. ఏ బలహీనతలవల్ల మన మనస్సు బాహ్యముఖానికి వెళుతోంది, అసలు మన మనస్సుకు కదలవలసిన పని ఏమిటి? ఇవన్నీ చూసుకొని ఆ కారణాల్లోంచి మనస్సుని బయటకు ఉపసంహరించాలి. అది చెయ్యటం మానేసి అందరూ బుద్ధిమంతులు అనుకుంటున్నారు మీరు బుద్ధిమంతులు అయితే మీకు ఆత్మజ్ఞానం ఎందుకు కలగలేదు. మేము మంచివాళ్ళము, మేము మంచివాళ్ళము అని కూర్చోకండి. మనకి రోగం ఉందనుకోండి రోగంలేదు అనుకుంటే మనకే ప్రమాదం డాక్టరుకి ప్రమాదం లేదు. మీరు ఇంటి దగ్గర ప్రతీరోజు ఒక గంటసేపు ఒంటరిగా కూర్చోవాలి. మీ మనస్సు ఎలా పని చేస్తుందో చూచుకోవాలి. ఏ కారణాలవల్ల మీ మనస్సు కదులుతోందో చూచుకొని జాగ్రత్తగా మీ అంతట మీరు అంచనా వేసుకొని ఆ కారణాలని తగ్గించుకుంటే మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-02-09, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు భీష్మఏకాదశి. భీష్ముడు అసలుపేరు దేవవ్రతుడు. తండ్రి సుఖంకోసం చుట్టూ ఎన్ని భోగాలుఉన్నా, వాటిని త్యజించి నేను వివాహం చేసుకోను అని భీష్ముడు ప్రతిజ్ఞ చేసాడు. ఆ ప్రతిజ్ఞ చేయటం వలన ఆయనకి భీష్ముడు అని పేరు వచ్చింది. భీష్ముడు మనందరికీ ఆదర్శపురుషుడు. బ్రహ్మచారి, మహాభక్తుడు, మహాజ్ఞాని. ఎ గుడ్‌మేన్ ఇన్ ఎబేడ్ పార్టీ.

ఆయన మహాత్ముడు కానీ కౌరవుల పక్షంలో ఉన్నాడు, ప్రారబ్దాన్ని ఎవరూ తప్పించలేరు. పరమాత్మే కృష్ణుడి రూపంలో వచ్చాడని పాండవులలో, కౌరవులలో మొట్టమొదట గుర్తించినది భీష్ముడు ఒక్కడే. ఒక మహాత్ముడుని ఇంకో మహాత్ముడు మాత్రమే గుర్తించగలడు. భీష్ముడిది స్వచ్ఛంద మరణం. ఆయనకి మరణం కావాలంటే వస్తుంది కాని పరమాత్మ కూడా ఆయనని చంపలేడు. పాండవులు భీష్ముడి దగ్గరకు వెళ్ళి తాతయ్యా నువ్వు చనిపో అంటే ఆయనకి కోపం రాలేదు, ఆశీర్వదించాడు, అలాగే మీరు చెప్పినట్టే వెళ్ళిపోతాను అన్నాడు. భీష్ముడు కనుక శరీరం చాలించకపోతే యుద్ధం ముగియదు, పాండవులు అందరూ చనిపోతారు. అటువంటి గొప్ప వీరుడు, మహాత్ముడు పేరు మీద ఉన్న ఏకాదశి ఈ భీష్మఏకాదశి.

భగవద్గీత మొత్తం 18 అధ్యాయాలు. మొదటి ఆరు అధ్యాయాలలో కర్మయోగం గురించి చెప్పాడు. తరువాత ఆరు అధ్యాయాలలో భక్తియోగం గురించి చెప్పాడు. చివరి ఆరు అధ్యాయాలలో జ్ఞానం గురించి చెప్పాడు. ఎవరికి ఏది ఇష్టమైతే ఆ మార్గంలో ప్రయాణం చెయ్యమని చెప్పాడు. మొత్తం మీద మోక్షమార్గంలో ఉండాలి అది మరచిపోకూడదు. హృదయపూర్వకంగా మీకు నచ్చిన మార్గాన్ని ఆచరిస్తే మీరు మోక్షాన్ని పొందుతారు. ధ్రువుడు తల్లిపేరు సునీతి. సునీతి అంటే మంచి నీతిగలది. ధ్రువుడు పినతల్లి ధ్రువుడుని అవమానం చేస్తుంది. ఆ మాటలు భరించలేకపోతాడు ధ్రువుడు. నన్నే గౌరవంగా చూడటంలేదు, నేను చెప్పినా మీ తండ్రి వినడు ఎందుకు నీ తండ్రిని ఆశ్రయించటం, భగవంతుడిని ఆశ్రయించు అని తల్లి ధ్రువుడుకి చెప్తుంది. ధ్రువుడు తపస్సు చేసుకోవటానికి అరణ్యానికి వెళ్ళిపోయాడు. మోక్షం పొందటానికి ఎవరైనా సిన్సియర్‌గా ప్రయత్నం చెస్తూ ఉంటే నారదుడు వాళ్ళకి ఏదో రూపంలో వచ్చి సహాయం చేస్తాడు. ధ్రువుడు మనస్సును పరీక్ష పెట్టటానికి నువ్వు చిన్నపిల్లవాడవు ఈ తపస్సులు ఏమిటి అని నారదుడు అడుగుతాడు. మా పినతల్లి నన్ను చాలా అవమానం చేసింది ఆ మాటలు భరించలేక వచ్చి నారాయణుని కోసం తపస్సు మొదలుపెట్టాను అని ధ్రువుడు చెబుతాడు. అపుడు నారదుడు అంటాడు ప్రతీమనిషికి అనుకూల పరిస్థితులు వస్తాయి, ప్రతికూల పరిస్థితులు వస్తాయి ఇవన్నీ భరించటం నేర్చుకోవాలి కదా ఆ మాటలే భరించలేనపుడు ఇంతటి తపస్సు ఎలా చేయగలవు అంటాడు. నాకు తపస్సు లేకపోవటంవలన ఆ మాటలు భరించలేకపోతున్నాను. తపస్సు ఎందుకు చేస్తున్నాను అంటే అటువంటి మాటలు ఎవరైనా అన్నా భరించటానికి తపస్సు చేస్తున్నాను అన్నాడు. నువ్వు నాకు నచ్చావు అన్నాడు నారదుడు. ఫలానా నది దగ్గరికి వెళ్ళి ఓం నమో భగవతే వాసుదేవాయ అని చెయ్యి. వాసుదేవుడి అనుగ్రహం

పొందుతావు. నీ పేరు మీద ధృవమండలం వస్తుంది, నీకు మోక్షం వస్తుంది. నీ పట్టుదలను నేను మెచ్చుకుంటున్నాను అంటాడు నారదుడు. జపం అందరూ చెయ్యాలి ధ్రువుడు ఒక్కడే కాదు. మన మనస్సు స్థాయి పెరగాలంటే, గుణవంతులు అవ్వాలంటే, చైతన్యస్థాయి పెరగాలంటే, మనస్సు ఉన్నతస్థితిలో ఉండాలంటే దానికి మార్గం జపం ఒక్కటే. జపం అంటే మీ ఇష్టదైవం యొక్క నామాన్ని శ్రద్ధగా చేసుకోండి.

డబ్బులేకపోతే తిండిలేదు, బట్టలేదు, నీడలేదు. అందుచేత మీ సంసారానికి ఏమీ లోటులేకుండా మీకు ఏమీ ఇబ్బంది లేకుండా మీ పని మీరు చేసుకొంటూ నాలుగు రూపాయలు సంపాదించుకోండి. కానీ సంపాదనే ముఖ్యమని సంపాదన మొదలుపెడితే మీరు పాపం చెయ్యకుండా ఉండలేరు. పాపం పెరిగిపోతే నీచజన్మలు వస్తాయి అని భగవంతుడు గీతలో చెప్పాడు. కర్మ గురించి గీతలో ఏమి చెపుతాడంటే నువ్వు చేసే కర్మను ఇక్కడ తగలబెట్టకుండా దాచుకుంటావు అనుకో ఆ కర్మని అనుసరించి మళ్ళీ జన్మలు వస్తాయి. మళ్ళీ శవాల్ని మోస్తూ ఉండవలసిందే. మీ ఇంట్లో వాళ్ళకి మీరు డ్యూటీ చెయ్యాలి కాని అస్తమానూ వాళ్ళని మనస్సులో మొయ్యకూడదు. మనస్సులో మోయవలసింది భగవంతుడిని మాత్రమే. ఇంటి దగ్గర మీ డ్యూటీ మీరు చెయ్యండి వాళ్ళు అభివృద్ధిలోకి రావచ్చు, రాకపోవచ్చు వాళ్ళ క్షేమం కోరాలి. చేతులతోటి పని చెయ్యాలి, మనస్సులో భగవంతుడిని పెట్టుకోవాలి. అది బుద్ధిమంతుడి లక్షణం. మనం ఏదైతే నేను, నేను అంటున్నామో, ఆ నేనే ప్రపంచంలో ఉన్న సమస్యలకి, కుటుంబంలో ఉన్న సమస్యలకి, మొత్తం అన్ని సమస్యలకి కారణమని నోటితో చెబుతాము కానీ లోపల మనకు అన్నింటికంటె ఆ నేను మీద అభిమానం ఎక్కువ. ఇంక అదెక్కడికి పోతుంది దానిని తొలగించుకోవటం జరిగే పనికాదు. మీకు ఆ నేను మీద ఉన్న అభిమానం మీ భర్తమీద కూడా ఉండదు. మీ తల్లిదండ్రులమీద కూడా ఉండదు. ఇంక దానిని ఎలా పోగొట్టుకుంటారు. మీరు సాధన చేసినా పోదు. మన ఆలోచనా విధానమే తప్పు. లోపల మనం అభిమానించేది ఆ నేనుని, చేసేది దానిని పోగొట్టుకోవాలని ప్రయత్నం, ఎలా సాధ్యం, అది పరస్పరం విరుద్ధం, ఇంక అది పోదు. అది ఉన్నంతకాలం సంసారం తప్పదు. మనుషులు సంసారంకాదు, ఆ నేనే సంసారం. ఈ సంసారాన్నిబట్టి మనుషులు వస్తారు. మాయ అంతా నేను రూపంలో ఉంది. అందులోంచి ఎవడైతే విడుదల పొందాడో వాడు ముక్తుడు. ఎక్కడా ఆసక్తిపెట్టుకోవద్దు. ఆసక్తి లేకుండా పనిచేస్తే అది నిన్ను బంధించదు. భగవద్గీత చదివి అర్థం చేసుకుంటే ఆ ప్రకారం మనం జీవిస్తూ ఉంటే ఇంక ఏమీ అక్కరలేదు. మనకు దేనిమీదైనా కాంక్ష ఉంది అనుకోండి,

ఇంక మనం సరైననిర్ణయం తీసుకోలేము.

నువ్వు ఏదైనా కోరుకుంటే అర్హత సంపాదించి, యోగ్యత సంపాదించి అప్పుడు కోరుకో. అంతేగాని నీకు అర్హతలేకుండా, యోగ్యతలేకుండా మోక్షం అడుగుతావు ఏమిటి? నీ మనస్సు ఎప్పడూ లోకవిషయాలను చింతిస్తోంది, నీకు విషయసుఖాలు తప్పించి ఏమీ అక్కరలేదు, కొండాలు చెప్పటం తప్పించి నీకు ఏమీ చేతకాదు. నువ్వు మోక్షం అడుగుతావు ఏమిటి? ఒకవేళ నువ్వు అడిగితేమటుకు దేవుడు ఇస్తాడా? లోపల నీకు ఎంత మెచ్యూరిటీ ఉందో, నువ్వు ఎంతవరకు ముగ్గావో ఆయనకు తెలియదా? అందుచేత నీవు ఏదైనా కోరుకుంటే అర్హత సంపాదించి అప్పుడు కోరుకో. ఆత్మజ్ఞానం ఎవరికి వస్తుంది అంటే, ఏ మనిషి మీదగాని, ఏ ప్రాంతంమీదగాని ఎటాచ్‌మెంట్ పెట్టుకోవద్దు. నీకు ఆసక్తి పనికిరాదు. మీ పనులేవో మీరు చేసుకోండి. ఆత్మజ్ఞానసముపార్జనపట్ల మీ మనస్సు స్థిరంగా ఉండాలి. వాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. పని పనికోసం చేయటం యజ్ఞం. ఇది ధర్మం అనుకుంటే ఆ పని చేయటం, ఇది ధర్మంకాదు అనుకుంటే ఆ పని మానెయ్యటం. కొంతమంది ఎలా ఉంటారు అంటే మాకు మీరేమీ ఇవ్వవద్దు మా వంక చూచి నవ్వమంటేకూడా నవ్వరు. వీళ్ళవంక చూచి నవ్వటం వలన మనకు ఏమి కలిసి వస్తుంది అనుకొంటారు. ఇంకవాళ్ళకు మోక్షం ఏమిటి? వాళ్ళకి కర్మలు చుట్టుకుంటూ ఉంటాయి. రాబోయే జన్మలు పెరిగిపోతూ ఉంటాయి. నీ స్వార్థాన్ని కొంత మరచిపోయి నీకు చేతనైనంతవరకు ఇతరులకు ఉపయోగపడుతూ ఉంటే, ఫలకాంక్ష లేకుండా ధర్మాన్ని ఆచరింటం కోసం, ఇతరుల క్షేమంకోసం నువ్వు కర్మ చేస్తూ ఉంటే నీ కర్మ నిన్ను చుట్టుకోదు. నువ్వు శవాలను మొయ్యక్కర్లేదు అని పరమాత్మ చెప్పాడు. మనకి భగవద్గీతను భోదించినవాడు ఎవడు? ఆయన జన్మరహితుడు, కర్మరహితుడు. కర్మచేసిన వాడివలె కనిపిస్తాడు కానీ ఆయన కర్మరహితుడు. పుట్టినవాడివలె కనిపిస్తాడు కాని పుట్టనివాడు ఆయన కృష్ణపరమాత్మ. ఆ శాస్త్రాన్ని చెప్పటానికి ఆయన మాత్రమే తగినవాడు.

తపస్సు అంటే మనస్సును దహింపచేయటం, నీ మనస్సును ఎండబెట్టటమే తపస్సు. మీ వాసనలు కోరికలు, పూర్వజన్మ సంస్కారాలు ఇవన్నీ మనస్సులో ఉంటాయి. మనస్సుని ఎప్పడైతే దహింపచేసామో అప్పుడు మనస్సులో ఉన్న వాసనలు, కోరికలు, సంస్కారాలు అన్నీ కాలిపోతాయి. మన చెయ్యికాలిందనుకోండి ఎంతో బాధగా ఉంటుంది. అలాగే మనస్సుని మీరు దహించేటప్పడు చాలా బాధగా ఉంటుంది ఇవన్నీ ఓర్చుకోవాలి. నీ మనస్సు మీద నీకు ఎక్కువ అభిమానం ఉన్నప్పడు నువ్వు దానినెలా కాల్చుకుంటావు. మీ భర్త ఎప్పడైనా మీకు

కష్టమైన నాలుగు మాటలు అంటే మీకు సడన్‌గా మీ భర్తమీద ఇష్టం పోతుంది. ఎందుచేతనంటే ఆ మాటలు మీ మనస్సుమీద పడ్డాయి. ఆ మాటలు పడటానికి మీ మనస్సుకు ఇష్టం ఉండదు. అప్పుడు వెంటనే మీ భర్తమీద కూడా ప్రీతిపోతుంది. అయితే భర్త అంటే మీకు ప్రీతిలేదు అనికాదు. భర్తకంటే మీ మనస్సు అంటే మీకు ఎక్కువ ప్రీతి. ఆ మనస్సును కాల్చాలి. అది ఊరికే మాటలవల్ల కాలదు. తింటే ఆకలి తీరుతుంది కాని అన్నం అన్నం అంటే ఆకలి తీరుతుందా? ఆకలి లేనివాడికి అన్నము పెడితే ఎలా ఉంటుందో అలాగ జిజ్ఞాస లేనివాడికి ఆత్మజ్ఞానం సముపార్జించాలనే కాంక్షలేనివాడికి, యోగ్యత లేనివాడికి సబ్జక్టు చెప్పినా అలాగే ఉంటుంది. అందుచేత పూర్వం ఇలా మీటింగులు పెట్టి చెప్పేవారు కాదు. ఆత్మజ్ఞానం నేర్చుకోవాలనే కుతూహలం కలిగి ఎవరైనా వస్తే వారికి చెప్పేవారు. లేకపోతే చెప్పేవారుకాదు. ఇప్పుడు ఈ సబ్జక్టు చెబుతున్నాము మీరందరూ బాగుపడిపోనక్కరలేదు. ఈ సబ్జక్టు శ్రవణం చేయటం వలన ఒక్కరికి అశాంతి తగ్గితేచాలు, ఒక్కరి మనస్సు ఉద్ధరింపబడితే సరిపోతుంది అంటే మీరందరూ బాగుపడకూడదనికాదు. ఈ మాటలు వలన ఒక్కరు బాగుపడినా చించినాడ వచ్చిన ప్రయోజనం నెరవేరుతుంది.

తపస్సు ఎందుకు చెయ్యాలంటే, సజ్జనసాంగత్యం ఎందుకు చెయ్యాలి అంటే బుద్ధిలో ఉన్న దోషాలు పోవటానికి, జ్వరం వచ్చినవాడికి పాయసం నోట్లో పెట్టినా రుచి ఉండదు. మనకి భగవద్గీత మీద ఎందుకు ఇంట్రస్టు కలగటం లేదంటే దేహానికి సంబంధించిన జ్వరంతోటి, లోకానికి సంబంధించిన జ్వరంతోటి, డబ్బుజ్వరం, కీర్తిజ్వరం, గొప్పలజ్వరం ఇలా ఏదో జ్వరంతోటి ఏడుస్తున్నాము. ఇంక మనకి భగవద్గీత ఎలా అర్థం అవుతుంది. రజోగుణం వల్ల రాగద్వేషాలు ఎక్కువ వస్తాయి. కామక్రోధాలు ఎక్కువ వస్తాయి. అన్ని కాలాల్లో, అన్ని అవస్థల్లో మనస్సుని శాంతిగా ఉంచాలి. తుకారాం అలా ఉండేవాడు, గౌరవం వచ్చినా, అగౌరవం వచ్చినా, సన్మానాలు చేసినా, అవమానాలు చేసినా, ఎవరైనా ఆయనను కొట్టినా, ఆయనను దూషించినా అన్ని కాలాల్లో ఎప్పుడూ మనస్సు సమానంగా ఉండేది. వాడికి బుద్ధిలో దోషాలు లేవు. పాండురంగడిని భజించి, భజించి, స్మరించి, స్మరించి ఆయనకి ఇష్టమైన పనులు చేస్తూ పాపాల్ని పోగొట్టుకున్నాడు తుకారామ్. మన బుద్ధిలో ఎప్పుడైతే దోషాలు లేవో, మనం ఎప్పుడైతే కల్మషరహితంగా ఉన్నామో, మనకి ఎప్పుడైతే లోపల బురద లేదో వాడు బ్రాహ్మీస్థితిని పొందుతాడు. అంటే బ్రహ్మము ఎంత నిష్కల్మషంగా ఉంటుందో, ఎంత శుద్ధంగా ఉంటుందో ఆ స్థితి నీ మనస్సుకు వస్తే నువ్వు కూడా బ్రహ్మాకారం పొందుతావు. బ్రహ్మాకారం పొందినవాడికి ఇంక జన్మలేదు. ఏ శుకమహర్షి లాంటివాళ్ళో అజ్ఞానంలోంచి జ్ఞానంలోకి ఎగిరివెళ్ళిపోవచ్చు. వాళ్ళ పూర్వపుణ్యం

బావుంటే అలా వెళ్ళిపోతారు. ఎవళ్ళో కొద్దిమంది అలాగ ఉంటారు. మనంకూడా అలా వెళ్ళిపోదాము అనుకోకూడదు. మనం చాలా సాధన చెయ్యాలి ఎందుచేతనంటే మనం శుభ్రంగా తడిచిపోయిఉన్నాము. నువ్వు సత్‌కర్మ నిష్కామంగా చేస్తూఉంటే, నీ మనస్సుకి నెమ్మదిగా నిప్ప అంటిస్తుంది. అప్పడు నీ మనస్సు ఢాం అని పేలిపోతుంది. అప్పడు మీరు సడన్‌గా బ్రాహ్మీస్థితిలోకి వెళ్ళిపోతారు. అయితే నిష్కామకర్మ మీరు అనుకున్నంత తేలిక కాదు. ఈ లోకంలో ఏదీ నిత్యం కాదు, ఎందులోనూ సుఖం లేదు. అయితే మన అలవాటుని బట్టి బయట వెదుకుతున్నాము. బాహ్యముఖానికి విజృంభిస్తున్న నీ మనస్సుని లోపలికి మళ్ళించేవాడే గురువు. కొంతమందికి లోకానికి సంబంధించిన అనుభవం ఎలా ఉంటుందో అలా కొంతమందికి ఆత్మానుభవం ఉంటుంది. వాళ్ళు లోకానికి సంబంధించిన విషయాలలో ఎలాగైతే మనకి సహాయం చేస్తారో అలాగ ఆత్మానుభవం పొందినవారు మీ చైతన్య స్థాయిని పెంచేసి మిమ్మల్ని భగవంతుడిలో ఐక్యం అయ్యేలాగ చేస్తారు. మనకి అదీ లేదు, ఇదీ లేదు. కొంతమందికి రెండూ ఉంటాయి. రాముడు, కృష్ణుడు అటువంటివారే, వాళ్ళే యుగపురుషులు, అవతార పురుషులు. మనం మంచివాళ్ళుగా ఉండనక్కరలేదు. మంచివాళ్ళని ప్రేమించేశక్తి, మంచివాళ్ళని గౌరవించే శక్తి కూడా మనకి లేదు.

ఈ లోకంలో వ్యవహరిస్తున్న మాకు ఏవో బెంగలు ఉంటూనే ఉన్నాయి. ఒక బెంగ వదిలిపోయింది అంటే ఇంకో బెంగపట్టుకొంటుంది అని ఒక భక్తుడు భగవాన్‌ని అడుగుతాడు. నీకు భగవంతుడు మీద నిజంగా నమ్మకం ఉంది అనుకో నీ జీవితాన్ని భగవంతుడి సంకల్పానికి వదిలేయి. భగవంతుడు ఏ టైములో మనల్ని ఎలా ఉంచుతాడో చెప్పలేము. నీ జీవితాన్ని భగవంతుడికి వదిలేసి నీ పని నువ్వు చూసుకో. ఒకోసారి ఫలితం వస్తుంది, ఒకోసారి ఫలితం రాదు. కర్మఫలం నీ చేతిలో లేదు. వస్తే పొంగిపోకు, రాకపోతే కుంగిపోకు. నీకు శాంతి, సుఖం వస్తే ఆయన ప్రసాదం అని ఎలా అనుకుంటున్నావో అలాగే అశాంతి, కష్టం వచ్చినా అది కూడా ఆయన ప్రసాదమే అనుకో, భగవంతుడి ఇష్టమే నా ఇష్టం, భగవంతుడి సంకల్పమే నా సంకల్పం అని నువ్వు జీవిస్తే ఆ రకంగా కూడా నీ మనస్సు కాలి బూడిద అయిపోతుంది. నువ్వు జున్ను తిన్నప్పడు ఎలా ఆనందంగా ఉంటున్నావో అలాగ నీ దేహప్రారబ్ధాన్ని ఆనందంగా అనుభవించేయమన్నారు ఆచార్యులవారు. తుకారామ్ ప్రారబ్ధాన్ని అలాగ ఎంజాయ్ చేసాడు. నీకు ఏదైనా చెడ్డ వచ్చి నీమీద పడిపోతూ ఉంటే దానిని ప్రతిఘటించకు, నువ్వు చెడ్డ చేయకు అని తుకారామ్ చెప్తాడు. కర్మమార్గంలో రెండు

లాభాలు వస్తాయి స్వార్ధ రహితంగా నువ్వు పని చేస్తూ ఉంటే ఒక పక్కన నీకు ఈ లోకానికి సంబంధించిన యాత్ర బాగా వెళ్ళిపోతుంది. నీ మనస్సు కాలిపోతుంది.

నాకు అప్పుడప్పుడు దుఃఖం వస్తుంది అని ఒక భక్తుడు అంటే దుఃఖం వస్తే రానియ్యి, ఒకోసారి దుఃఖం రావటం కూడా మంచిదే. నీకు వచ్చిన దుఃఖం, నీకు వచ్చిన కష్టం నీకు వచ్చిన బాధ నీ ముఖాన్ని భగవంతుడివైపుకి తిప్పటానికి పనికి వస్తుంది. అర్జునుడి యొక్క దుఃఖం, అర్జునుడి యొక్క విషాదం వలన వాడికి రోగం రాలేదు అది వాడిని యోగం వైపుకి తిప్పింది యోగం అంటే భగవంతుడిలో ఐక్యం అవ్వటం. మనకి శరీరంతోటి వియోగంకాదు, మనకి మనుషులతోటి వియోగం కాదు, దుఃఖంతోటి వియోగం కావాలి, అప్పుడు మోక్షం. జీవితంలో చాలా అవమానాలు భరించవలసి వస్తోంది అని ద్రౌపతి విదురుడితో చెపుతుంది. అవమానాలు భరిస్తున్నాను అని అనుకోకు, మహావిష్ణువుని స్మరించుకో అవమానం కూడా అవమానం కింద నీకు కనిపించదు అంటాడు విదురుడు. మహావిష్ణువుని స్మరించుకుంటే నీ బాధలు బాధలకింద కనిపిస్తాయా. నీ అశాంతి అశాంతిగా కనిపిస్తుందా అంటాడు విదురుడు. నేను చాలా అవమానాలు భరిస్తున్నాను, నాకు దుఃఖం వచ్చేస్తోంది అని మనస్సును ఇటు తిప్పేబదులు, అటు మహావిష్ణువును స్మరించుకో. నీ అవమానాలు అన్నీ బహుమానాలకింద మారిపోతాయి అందుచేత ఇలా అనుకొనే బదులు అలా అనుకో అని విదురుడు చెప్పాడు. అ వాక్యంతోటి ఆవిడకి ఆవేశం ఆగిపోయింది. మనం మంచివాళ్ళని తలపెట్టకుండా ఎప్పుడూ చెడ్డవాళ్ళని తలపెట్టుకుంటాము. మనం చెడ్డవాళ్ళము కాబట్టి మనకు ఎప్పుడూ చెడ్డవాళ్ళే జ్ఞాపకం వస్తూ ఉంటారు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-01-09, భద్రాచలం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనలని రక్షించేది రామాయణం. అనేకమంది దేవతలు, అనేక గ్రంధాలు మనకు అవసరం లేదు, ఇది ఒక్కటే మనకు చాలు. పూర్వం వేదాలను గురువు శిష్యులకు చెప్పేవారు. శిష్యులు వల్లించటం మళ్ళీ వాళ్ళ శిష్యులకి చెప్పటం అలా మనవాళ్ళు వేదాలను మోసుకు వస్తున్నారు. వేదాలని చదివి మనకు అర్థం చేసుకునేంత మేధస్సు లేదు, అంత సహనము లేదు. అందుచేత బ్రహ్మదేవుడి ప్రేరణ మీద వాల్మీకిమహర్షి వేదాలలో ఉన్న సారమే రామాయణం క్రింద వ్రాసాడు. వేదాలలో ప్రతిపాదించిన పరమాత్మ రాముడికింద వచ్చాడు. అమ్మవారు సీతమ్మవారికింద వచ్చారు. ప్రతీవాళ్ళకి కుటుంబం ఉంటుంది కదా! ఆ కుటుంబ జీవితం

ఐకమత్యంగా, ప్రేమగా ఉండాలి అంటే అది రామాయణానికే సాధ్యం. అందుచేత అవకాశం ఉన్నప్పుడల్లా అందరూ రామాయణం పారాయణ చేయటం మంచిది. రామాయణం చదివి మీరు అర్థం చేసుకుంటే నాలుగు వేదాలు మీకు అర్థం అవుతాయి. నాలుగు వేదాల సారమే రామాయణంలోకి తీసుకువచ్చారు. గాయత్రీ మంత్రం యొక్క రహస్యం అంతా రామాయణంలో ఉంది, గీత, గంగ, గాయత్రి, గోవింద. భగవద్గీతని మీరు చదివి అధ్యయనం చేసి అర్థం చేసుకోండి, గంగానదిలో స్నానం చెయ్యండి, గాయత్రీ మంత్రాన్ని జపించండి, గోవిందుడిని ధ్యానం చేయండి, వాటి వల్ల మీరు బాగుపడతారు. భజగోవిందం శ్లోకాల వల్ల కూడా మీకు భగవంతుడి మీద ప్రేమ, ప్రీతి కలుగుతుంది. సీతారాముల కళ్యాణం అంటే లోకకళ్యాణం. మనం ఎప్పుడూ కూడా మేనిఫెస్టెడ్‌గాడ్‌ని ఆరాధించటం మంచిది. భగవంతుడు గురించి నిరాకారుడు, నిర్గుణుడు అని చెబుతారు. సాకారుడు, సగుణుడు అని అనుకోవచ్చు ఎలాగ అనుకున్నా భగవంతుడు ఉన్నాడు. రూపం ఉన్నా ఆయనే, రూపం లేకపోయినా ఆయనే. ఆ పరమాత్మే కాళ్ళు చేతులు తొడుక్కుని వచ్చాడు వాడే రాముడు.

మనం భగవంతుడి యొక్క రూపాన్ని, ఆయన గుణాల్ని పట్టుకొని, ఆయనని ఆరాధన చేసుకొని, ఉపాసన చేసుకుని ఇవి అన్నీ సపోర్టుగా తీసుకుని ఆ నిర్గుణానికి, నిరాకారానికి పాకి వెళ్ళాలి. మనకి ఒక రూపం, నామం ఉన్నప్పుడు, ఇంకో రూపం, నామం ఉన్న దేవుడిని మనం ఆరాధన చేయగలంకాని, రూపనామములు లేనివాడిని పట్టుకోవటం కష్టం. మన బుద్ధి పట్టుకోలేదు. రాముడు, కృష్ణుడు వీళ్ళు అవతరించిన దేవుళ్ళు. మనం వాళ్ళని ఆధారంగా చేసుకొని ఉన్న వస్తువును పొందాలి. వాళ్ళు మన స్వరూపంగానే ఉన్నారు. మన స్వరూపం అంటే అరూపం, అరూపం మనకి అందదు. మన కోసం వాళ్ళే రూపం ధరించివచ్చారు. మనం భగవంతుడు రూపాన్ని పట్టుకొని అరూపం దగ్గరకి చేరుకోవాలి. ప్రపంచం అంటే భగవంతుడి యొక్క నీడ. భగవంతుడి యొక్క మిధ్యారూపమే. మనం భగవంతుడిని వదిలేసి ఆయన నీడని పట్టుకున్నాము. ఈ ప్రపంచం అంటే అందరకీ ఇష్టమే. ఇష్టంలేని వాళ్ళు ఎవరూ లేరు. ఈ ప్రపంచం మనలని సుఖపెట్టకపోయినా సుఖపెడుతుందనే భావన మనకు ఉంది. ఇలా కొంతకాలం బతికిచచ్చిపోతాము. ఈ ప్రపంచంలో నూటికి నూరు పాళ్ళు సుఖంలేదు. ఒకవేళ సుఖాన్ని ఇచ్చినా ఈ రోజు ఇచ్చిన సుఖం రేపు పోతుంది. ఎందుచేతనంటే ఆ సుఖం నిజం కాదు. ప్రపంచంలో నుండి సుఖం వస్తోందని మనకి అనిపిస్తోంది కాని అందులో సుఖం లేదు. కామక్రోధాలు ఇద్దరూ అన్నదమ్ములు. వీళ్ళిద్దరూ

కలిసే తిరుగుతూ ఉంటారు. కోరిక ఎక్కడైతే ఉందో అక్కడ కోపం వచ్చేస్తుంది. మనకి ఉన్న చెడ్డగుణాలకి కామక్రోధాలు కమాండర్స్. అన్ని చెడ్డగుణాలు కామ, క్రోధాలులోంచే వస్తాయి. పొయ్యిలో పుల్లలు పెట్టేకొలది నిప్పు ఆరదు, పెరిగిపోతుంది. అలాగే కోరికలు నెరవేర్చుకునేకొలదీ కోరికలు పెరిగిపోతాయి కాని ఇంక తగ్గవు. కోరికలు నెరవేరేకొలదీ దేహము నేను అనే బుద్ధి పెరిగిపోతుంది. అనుకున్న కోరికలు అన్నీ బాగా నెరవేరిపోతున్నాయి అని మనం అనుకుంటాము. కాని మీరు లోపల కుళ్ళిపోతూ ఉంటారు. జరిగేది ఇదే.

కృష్ణుడు ఏమని చెప్పాడంటే వృక్షాలు మనకి కనిపిస్తున్నాయి, ఆ వృక్షాలకి లోపల బీజం ఉంటుంది. లోపల ఆ విత్తనంలోంచి వృక్షం అంతా వచ్చింది. అలాగే మొత్తం సంసారం అనే పెద్ద చెట్టుకి బీజం కామం అని చెప్పాడు. అందులోంచే కోరిక వస్తోంది, అందులోంచే కోపం వస్తోంది. కామం గురించి చెపుతూ ఇది మహాశని అన్నాడు కృష్ణపరమాత్మ. కామాన్ని తృప్తి పరచినవాడు ఈ సృష్టిలో ఎవడూ లేడు. కామానికి ఆకలి ఎక్కువ, దానికి ఆకలి వేస్తోందని తిండి పెట్టేస్తే ఇంకా తినేస్తుంది, దున్నపోతులాగ తినేస్తుంది. ఇంతవరకు ఈ సృష్టిలో ఆ కామానికి అన్నంపెట్టి కామం యొక్క గొయ్యిని పూడ్చినవాడు ఎవ్వడూ లేడు, సృష్టిలో ఉన్న మహారాజులు కూడా ఆ గొయ్యిని పూడ్చలేకపోయారు. అంటే ఇంతవరకూ కోరికలను నెరవేర్చుకొంటూ కోరికలను జయించినవాడు ఎవడూ లేడు అని అర్థం. మనిషికి ఆశ ఎప్పుడు అయితే ఉందోవాడు ఎన్ని అబద్దాలు కావాలంటే అన్ని అబద్దాలు చెప్పేస్తాడు. లోపల పూర్తిగా కుళ్ళిపోతాడు. బయట మంచి మంచి కార్లలో తిరుగుతాడు లోపల మనస్సు కుళ్ళిపోతుంది. ఇంక రిపేరు చేయటానికి కూడ వాడు పనికిరాడు. డైరెక్టుగా వాడు నరకానికి వెళ్ళిపోవలసిందే. నరక ద్వారములు వీళ్ళకోసమే తెరచిఉంచుతారు. భయము, కోపము, కోరిక ఈ మూడు ఉన్నవారు పక్కవాళ్ళని అడగనక్కరలేదు, వాళ్ళు డైరెక్టుగా నరకానికి వెళ్ళిపోతారు. ఎప్పుడైనా మనం చేసిందే మనకి ఎదురువస్తుంది కాని మనం చెయ్యనిది ఏదీ ఎదురురాదు. మనకి భగవంతుడు అలా చేసాడు ఏమిటి? ఇలా చేసాడు ఏమిటి అనుకుంటాము. మనకి ఇష్టంలేని పని అయితే వాడిని తిట్టుకుంటాము, చిరాకుపడతాము, ఒకోసారి దేవుడు లేడేమో అనుకుంటాము. భగవంతుడు సత్యసంకల్పుడు. మనకి ఏదైనా కష్టం వచ్చిందనుకోండి ఆకష్టం ఆయనకు తెలియకుండారాదు. ఇది భగవంతుడి సంకల్పం వల్ల వచ్చింది అని దానినిమనం అంగీకరించకలిగితే అటువంటి కష్టాలు రాబోయే జన్మలో రావు. మనం భగవంతుడి సంకల్పాన్ని అంగీకరించం సరికదా రియాక్టు అవుతాము.

లోకంలో కొంతమంది బాగుపడుతూ ఉంటారు, కొంతమంది పాడైపోతూ ఉంటారు. బాగుపడేవాళ్ళమీద మనంరాగం పెట్టుకోకూడదు. పాడైపోయేవాళ్ళమీద ద్వేషం అసలు పెట్టుకోకూడదు. వాళ్ళు బాగా బాగుపడ్డారు. ఎందుకు బాగుపడ్డారు. వీళ్ళు పాడైపోయారు. వీళ్ళు ఎందుకు పాడైపోయారు అని వాళ్ళ దగ్గరనుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి కాని వారి మీద ఇష్టము, అయిష్టము మనకి అనవసరం దాని వలన మనకి టైం వేస్టు, ఎనర్జీ వేస్టు. మనం పుస్తకాలలో నేర్చుకునే పాఠాలు కంటే మనకి జీవితం నేర్పే పాఠాలు ఎక్కువ ఉంటాయి. చాలామంది పెద్దవాళ్ళు ఎందుకు అయ్యారు అంటే వాళ్ళు పుస్తకాలు చదివి అవ్వలేదు. వాళ్ళ జీవితం నేర్పిన పాఠాలు ఉంటాయి. ఆ పాఠాలననుసరించి వాళ్ళ జీవితాన్ని అలా తీర్చిదిద్దుకుంటారు. వాళ్ళు ఎవరినీ ద్వేషించరు, ఎవరి మీద మమకారం పెట్టుకోరు. గాంధీగారిని ఈ రోజున చంపేసారు. ఆయన జీవితం పొడుగునా రామనామం చేసారు. మనమూ రామనామం చేసాం. గాంధీగారు రామనామం ప్రేమగా, ఇష్టంగా, విశ్వాసపాత్రుడై చేసారు, ఆయన ప్రాణం పోయేటప్పుడు కూడా రామనామమే వచ్చింది. నేను అన్నం లేకుండా బతకగలను, గాలి లేకుండా బతకగలను కానీ రామనామం చెయ్యకుండా జీవించలేను అన్నాడు బాపూజీ. మనం నామం యాంత్రికంగా చేస్తున్నాము. అక్కడ మనస్సు పెట్టి చెయ్యటం లేదు. మీరు దేవుడి నామం హృదయపూర్వకంగా చేస్తూ ఉంటే ప్రాణాయామం అవీ అవసరం లేదు. మిగతా విషయాలు ఎందుకు చేస్తున్నాము అంటే నామానికి ఉన్న శక్తిమీద, నామానికి ఉన్న వైభవం మీద, నామం మనకి ఇచ్చే ప్రసాదం మీద నమ్మకం లేక, భగవంతుడి మీద గౌరవం విడిచిపెట్టేసి దొమ్మరవిద్యల్లోకి వెళ్ళిపోతున్నాము. కామక్రోధాలు రజోగుణంలోంచి వస్తున్నాయి. ఆ రజోగుణంలోంచి వచ్చిన కామక్రోధాలు బుద్ధిమంతులకిమటుకి అవి శత్రువులే. వాటిని శత్రువులుగా చూచినా, వాటిని బుజ్జగించి, బుజ్జగించి అవి విజృంభించకుండా చేసి కామక్రోధాల్లోంచి విడుదలపొందు. మనకి అనేక తలంపులు వస్తాయి. ఆ తలంపులు కూడా సుడిగుండాలు. కామం ఒక తలంపు క్రోధం ఒక తలంపు ఇవన్నీ సుడిగుండాలు ఏదో సుడిగుండంలో పడికొట్టుకొనిపోతున్నాము.

గురువుని మనం గౌరవించాలి. గురువుపట్ల మనకి గౌరవం లేకపోతే ఆ గురువు మంచిమాటలు చెప్పిన అవి మన మనస్సుకి పట్టదు. అందుచేత ఎప్పడూ గురువుపట్ల గౌరవం కలిగి ఉండాలి. గురువు అంటే ఈశ్వరుడి యొక్క ప్రతినిధి. ప్రపంచంలో జ్ఞానానికి మించింది లేదు, జ్ఞానంతోటి సమానమైనది కూడా లేదు అని కృష్ణుడు గీతలో చెప్పాడు. ఇప్పడు ఏమి

చెబుతున్నారు అంటే ప్రపంచంలో ధనంతోటి సమానమైనది లేదు, దానికి మించింది లేదు అంటున్నారు. భగవంతుడు చెప్పేది సత్యమా? మనం అనుకునేది సత్యామా? భగవంతుడు చెప్పేది సత్యం. కాని మన మనస్సు దానికి అంగీకరించటంలేదు. నిజాన్ని మన మనస్సు అంగీకరించకపోయినా అది నిజమే. భగవంతుడు చెప్పింది శాసనం. నువ్వు అంగీకరించకపోతే కాలప్రవాహంలో కొట్టుకుపోతావు. ఇప్పుడు మనం అందరం ధృతరాష్ట్రుడి కింద తయారయ్యాము. మంచిమాటలు ఎవరు చెప్పినా ధృతరాష్ట్రుడు వినేవాడు. కాని ఆ మంచిమాటలని ఆచరణలో పెట్టటానికి కొడుకులు జ్ఞాపకంవచ్చి ఆగిపోయేవాడు. దుర్యోధనుడు వాళ్ళు బాగుపడాలని లోపల ఉండేది అది మమకారం. మమకారం వల్ల వాడు పోయాడు, వాడి వంశం అంతా పోయింది. అశోకుడి కొడుకు ఒకసారి తప్పు చేస్తే, అప్పుడు ధర్మశాస్త్రం ప్రకారం ఆ తప్పు చేసినవాడికి శిక్ష కళ్ళు తీసేయాలి, అలాగే అశోకుడు తన కొడుకుకి కళ్ళు తీయించేసాడు. వాడు అశోకుడు. రాజు ఏమి చెయ్యాలి అంటే ఆ కుర్చీలో కూర్చున్నప్పుడు మమకారం పెట్టుకుంటే వాడు పాడైపోతాడు. రాజు రాజులాగే ఉండాలి.

పరమాత్మ గీతలో ఏమని చెప్పాడు అంటే నీకు సబ్జక్టు అర్థంకాకపోతే ప్రశ్నించి తెలుసుకో అన్నాడు. ప్రశ్నించి తెలుసుకుంటే మన బుద్ధికి అందనటువంటి విషయాలు కొన్ని తెలుస్తాయి. ఒకోసారి శిష్యులు ప్రశ్నించే పద్ధతిలో గురువుకి ఆశ్చర్యం కలుగుతూ ఉంటుంది. అటువంటి బుద్ధి సూక్ష్మత కలిగిని శిష్యులు కూడా ఉన్నారు. ప్రశ్నించే పద్ధతిలో సత్యాన్ని అన్వేషించాలనే బుద్ధి పెరుగుతుంది. మనకి తెలివితేటలు ఉన్నాయి కాని అవి పనికిరాని తెలివితేటలు. కుయుక్తులు, కుతంత్రాలు, కుచేష్టలు ఇతరులను పాడుచేయటానికి ఉన్నాయి కాని మనకి మనం బాగుపడే తెలివితేటలు అసలు లేవు. ఆత్మస్తుతి, పరనింద ఇవి రెండూ ప్రయత్నం చేసి విడిచిపెట్టేయాలి. మన మనస్సులో ఏముందో మామూలుగా కాదు భూతద్దంపెట్టి చూడాలి. భూతద్దం పెట్టుకొని చూచుకుని ఆ బలహీనతలని ఎలా తొలగించుకోవాలో చూచుకుని మనస్సులో ఉన్న బలహీనతలని మనం తొలగించుకొంటే ఇంక మనకు పునర్జన్మలు ఉండవు. దానికి బాగా విశ్లేషణ ఉండాలి, వివేకం ఉండాలి. అందుచేత మనం సాధన విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. బుద్ధుడి రాజ్యం కంటే బింబిసారుడి రాజ్యం పెద్దది. బింబిసారుడు బుద్ధుడి దగ్గరకు వచ్చి నా రాజ్యంలో సగం నీకు ఇచ్చేస్తాను నువ్వు ఇంటికి వచ్చేయి అన్నాడు. బుద్ధుడు నీ రాజ్యం నాకు వద్దు అని చెప్పేలేదు. నేను సత్యాన్వేషణలో ఉన్నాను, మానవుడిని దుఃఖంలేనిస్థితికి తీసుకువెళ్ళే ప్రయత్నంలో ఉన్నాను. సత్యాన్వేషణకి నీ

రాజ్యం నాకు ఉపయోగపడితే నువ్వు ఇచ్చిన రాజ్యం తీసుకోవటానికి నాకు ఏమీ అభ్యంతరం లేదు అన్నాడు బుద్ధుడు. అప్పడు బింబిసారుడు ఏమన్నాడు అంటే నేను ఇచ్చేది నువ్వు వద్దు అంటున్నావు అది బాగానే ఉంది. మరి నువ్వు సత్యాన్వేషణ చేసి ఏదో పొందుతాను అంటున్నావు కదా! మరి నువ్వు పొందింది నాకు చెప్పవా అన్నాడు. అలాగే చెప్తాను అన్నాడు. తరువాత బుద్ధుడు బింబిసారుడిని వాళ్ళింటికి రమ్మనలేదు. బుద్ధుడే బింబిసారుడి ఇంటికి వెళ్ళి బోధించాడు అది పెద్దమనుషుల లక్షణం. మనకి తెలుసుకోవాలనే కాంక్ష ఉన్నప్పడు వారు తెలియపరుస్తారు. మనం ఏదో సాధన చేస్తాము కానీ మనకు అసలు జిజ్ఞాస లేదు.

ఐన్‌స్టీన్ అన్నాడు ఈ ప్రపంచంలో మొత్తం హ్యూమన్ జాతి అంతా రెండు విషయాల మీద ఆధారపడి తిరుగుతోంది. 1. అలవాట్లు, 2. కోరికలు. కొంతమంది వాళ్ళకి అలవాట్లు ఉంటే ఎంత డబ్బు అయినా ఖర్చుపెట్టేస్తారు. సారాకి రోజుకు పదివేలు ఖర్చుపెట్టేవాళ్ళు ఉన్నారు. పదివేలు ఉంటే రెండు సంసారాలు వెళ్ళిపోతాయి. తోటిమానవులు బట్టలు లేకుండా కొంతమంది ఉన్నారు, తిండి లేకుండా కొంతమంది ఉన్నారు. నీడలేక ఎండలో పడి కొంతమంది ఉన్నారు అనే స్పృహలేకవాడి అలవాట్లకి డబ్బు ఖర్చు పెట్టేస్తాడు. మనకి ఏవో అలవాట్లు ఉంటాయి. ఆ అలవాట్లని బట్టి వాటికూడా వెళ్ళిపోతాము. దేహానికి ఇంద్రియాలు ఉన్నాయి. ఒక ఇంద్రియానికి ఒక అలవాటు ఉంటుంది. మనకి ఏదో విషయచింతన ఉంటుంది. ఆ విషయాలకూడా ఇంద్రియాలు పరుగెడుతూ ఉంటాయి. చివరికి అది మన బుద్ధిని పాడుచేస్తుంది. వర్తమానకాలం చూస్తే భోగాలతోటి వెళ్ళిపోతుంది. భూతకాలం చూస్తే ఏవో విషయాలు తలపెట్టుకొని కాలాన్ని పాడుచేసుకొన్నాము. ఇంక ఈ భవిష్యత్తుకాలం మరీ ప్రమాదం. ఏదైనా 5వ తారీఖున చేయాలని వాయిదా వేసారు అనుకోండి 5న తారీఖు వచ్చేస్తుంది. మనం ఆపుచేద్దాము అన్నా కాలం ఆగదు. కాలాన్ని మనం ఎక్కడ ఆపు చేయగలం. అలాగే పూర్వజన్మల్లో దేహబుద్ధితోటి, అహంకారంతోటి చేసిన పనులు ఉన్నాయి. మంచిపనులు ఉండవచ్చు, చెడ్డపనులు ఉండవచ్చు. అవి అన్నీ కూడా నిన్ను ఎప్పడు పట్టుకుందామా అని కనిపెట్టుకొని ఉంటాయి, వీళ్ళు చేసి మర్చిపోయారు అని కొండచిలువకిందవచ్చి ఆ జీవుడిని పట్టేస్తుంది. ఒకోసారి మీకు సుఖప్రారబ్దం వచ్చేస్తుంది. డబ్బు వచ్చి మీద పడిపోతూ ఉంటుంది, అందరూ గౌరవిస్తూ ఉంటారు. మీకు పదవులు వచ్చేస్తాయి అప్పడు మీలో ఉన్న నకిలీ నేను పొంగిపోతూ ఉంటుంది. లైఫ్‌ని ఎంజాయ్ చేస్తున్నాను ఎక్కడ చూచినా ఊరేగింపులే, ఎక్కడ చూచినా సన్మానాలే అని వాడు అనుకుంటాడు. వాడి ఎంజాయ్‌మెంట్ అంతాకూడా మళ్ళీ రెట్టింపుకి

రెట్టింపు దుఃఖం కింద మారిపోతుందని ఈ అమాయకుడికి తెలియదు. అది భవిష్యత్తుకాలంలో వచ్చేస్తుంది. మనం విధి చేతిలో పనిముట్లము. ఎప్పుడు ఏ ప్రారబ్దం మన జీవితాన్ని ఎలా మలుపు తిప్పుతుందో చెప్పలేము. మీరు ప్రాపంచిక విషయం గురించి పొంగిపోతున్నారు అంటే భగవంతుడికి దూరం అవుతున్నారు లోకానికి దగ్గర అవుతున్నారు అని అర్థం. పాపప్రారబ్దం అనుభవిస్తూ ఉంటే ఆ జీవుడే అనుభవించాలికాని, అయ్యోపాపం ప్రారబ్దం అనుభవిస్తున్నాడు అని జాలిపడి వాడిని హృదయంలోకి తీసుకునేవాళ్ళు, ఒడిలోకి తీసుకునేవారు ఎవరు ఉంటారు. పాపప్రారబ్దం వాడు అనుభవిస్తూ ఉంటే, వాడు ఏడుస్తూ ఉంటే కనీసం మీ చెంగు పట్టుకెళ్ళి వాడి కళ్ళు తుడిచేవాళ్ళు ఎవరు ఉంటారు? ఎవరూ ఉండరు. ఎవరు మటుకువారు బిజీ. అందుచేత భవిష్యత్తు ఇంకా ప్రమాదం. నీకు ఆత్మజ్ఞానం రాకుండా ఇవన్నీ ప్రతిబంధకాలు. భూతప్రతిబంధకం, వర్తమాన ప్రతిబంధకం, భవిష్యత్తు ప్రతిబంధకం.

నీ హృదయంలో ఒక నిజం ఉంది. ఆ నిజం నీ హృదయంలో ఎంత లోతులో ఉందో అంత లోతుల్లోకి మనం వెళ్ళగలిగితే కాని అది దొరకదు. మనం ఏదో కొంతదూరం వెళతాము అక్కడనుంచి ఎంత సాధన చేసినా వెళ్ళలేము. ఇంక అక్కడ నుంచి గానుగెద్దులాగ ఉంటాము. ప్రయత్నం చేస్తున్నాము అభివృద్ధి ఏమీ కనపడటం లేదని తెలుస్తూ ఉంటుంది. ఎక్కడ ఉన్న వాళ్ళము అక్కడే ఉన్నాము అని. పాపం వీళ్ళు కష్టపడుతున్నారు అని గురువు చూస్తాడు. ఏ బలహీనత అయితే వీళ్ళకి అడ్డువస్తోందో వీళ్ళకి తెలియటం లేదు కష్టపడుతున్నారు, లోపలికి వెళ్ళటానికి ప్రయత్నం చేస్తున్నారు అని సడన్‌గా ఏమి చేస్తాడు అంటే ఒక్క తన్ను తన్నుతాడు. ఏ బలహీనత మీకు అడ్డు వస్తోందో అది సహస్రారానికి వచ్చేస్తుంది. అది ఎక్కడో లోపల ఇరుక్కుపోయి ఉంటుంది. దానిని మన తెలివితేటలు పట్టుకోలేవు. గురువు అనుగ్రహం వల్లే అది నీకు తెలుస్తుంది. మనం భగవంతుడి దగ్గరకు వెళ్ళినా, గురువు దగ్గరకి వెళ్ళినా ఆయన దయ, అనుగ్రహం తప్పించి ఇంకేమీ కోరుకోవద్దు. సంసార విషయాలు అడగటం కూడా అనవసరం. ఎందుచేతనంటే మనకి ఏది అవసరమో ఆయనకు తెలుసు. మనం ఏదైనా ఇవ్వమని బలవంతం పెట్టేస్తాము అనుకోండి ఇస్తే పాడైపోతాడే అని ఇవ్వకుండా కూర్చుంటాడు. అంటే మనకి ఏది మంచిదో మనకు తెలియదు. మీరు కోటి జన్మలు ఎత్తినా, కోటి పుణ్యాలు చేసినా మీ సహస్రారం శుద్ధి అవ్వకుండా ఎవడికీ ఆత్మజ్ఞానం రాదు. మీరు లోపలికి ఎందుకు వెళ్ళలేకపోతున్నారు అనేది గురువు చూస్తాడు. మీ లోపల కెలుకుతాడు. మీకు కెలికినప్పుడు తలుపు సందులో పెట్టి మిమ్మల్ని నొక్కేస్తే అప్పుడు ఎంత బాధ వచ్చేస్తుందో

మీకు అంత బాధ కలుగుతుంది, లోపల కత్తి పెట్టి కోసినట్టు ఉంటుంది. అది కెలికితేగాని పైకిరాదు. సహస్రారానికి వస్తేకాని మీకు అది ఉన్నట్టు తెలియదు. ఒకోటి ఒకోటి చూస్తూ ఉంటాడు. మొత్తం వాసనాక్షయం అయ్యేవరకు నిన్ను విడిచిపెట్టడు వాడు గురువు. బోయవాడు జంతువును ఎలా వెంటాడుతూ ఉంటాడో అలాగే నీ మనస్సనే జంతువునీ, నీ అజ్ఞానమనే జంతువుని, అవిద్య అనే జంతువుని ఏది నీ స్వరూపాన్ని మరుగుపరుస్తోందో ఆ జంతువుని గురువు కాడా అలాగే వెంటాడుతూ ఉంటాడు. అప్పుడు మనకి ఏమి అనిపిస్తుంది అంటే మన గురువు గొడవ వదిలించుకుందాము, చాలా ఇబ్బందులు పెడుతున్నాడు అనిపిస్తుంది. వదిలించుకుందామని మనకి ఉన్నా ఆయన మనల్ని విడిచిపెట్టడు. గురువు ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితిని మనం అందుకునే వరకూ విడిచిపెట్టడు వాడు గురువు.

రాముడు సీతమ్మని అరణ్యవాసానికి తీసుకువెళ్ళను అంటే సీతమ్మ రాముడిని నిందించింది. ఆవిడ ఆ టెన్షన్ భరించలేక నిందిస్తోంది అని రాముడికి అర్థమయ్యింది. రాముడు కామ్‌గా ఉన్నాడు. రాముడిని పెద్దరికంతోటి కూడిన దేవుడు అంటారు. రాముడు దగ్గర అలా మాట్లాడటంలో సీతమ్మ ఫెయిల్ అయ్యింది కాని లక్ష్మణుడు ఎప్పుడూ ఫెయిల్ అవ్వలేదు. రామరావణ యుద్ధం జరుగుతూ ఉంటే లక్ష్మణుడు మూర్ఛపోయాడు. అప్పుడు రాముడు అంటాడు సీతలాంటి భార్య దొరకవచ్చు కానీ లక్ష్మణుడులాంటి సోదరుడు దొరకడు అన్నాడు. లక్ష్మణుడికి పెళ్ళి అయ్యింది కానీ రాముడు సేవలో ఎప్పుడూ అతనికి భార్యకూడా గుర్తుకు రాలేదు. అంటే అది శరణాగతి, మినహాయింపులులేని సేవ. వాడు లక్ష్మణుడు. మనం రాముడిని ఎందుకు ఆరాధించమంటే ఆయన కంటే మనమే పెద్దవాళ్ళమని అనుకొంటున్నాము ఇంక రాముడుని ఏమి ఆరాధిస్తాము. మనం చాలా పొగరుబోతుతనంగా ఉంటున్నాము. స్త్రీలు అందరూ సీతమ్మని ఆదర్శంగా తీసుకుంటే, పురుషులు అందరూ రాముడిని ఆదర్శంగా తీసుకుంటే సమాజం అంతా బంగారం అయిపోతుంది. మనం రాముడిగా ఉండకపోయినా ఫరవాలేదు, ఇంట్లో ఆడవాళ్ళు అంతా సీతమ్మలాగ ఉండాలని పురుషులు అనుకుంటారు అని చలంగారు అనేవారు. ఇప్పుడు సమాజపరిస్థితి ఇలా ఉంది. ఇంద్రియాలలో కామం ఉంది, మనస్సులో కామం ఉంది, బుద్ధిలో కామం ఉంది. ఈ బుద్ధికంటె పైవాడు పరమాత్మ. ఆ పరమాత్మ పాదాలు పట్టుకోకుండా ఈ కామం విడిచిపెట్టదు అని వివేకానందుడు చెప్పాడు. ఎక్కడైతే రాముడు ఉన్నాడో అక్కడ కాముడు ఉండడు. ఎక్కడైతే కాముడు ఉన్నాడో అక్కడ రాముడు ఉండడు. రాముడి రాజ్యంలో ఎవరైనా తప్పచేస్తే నాలో ఏదో తప్పు ఉంది లేకపోతే నా రాజ్యంలో తప్పు

ఎందుకు చేస్తారు అనుకునేవాడు. వాడు రాముడు. రాముడుని చూస్తే పురుషులకి మోహం కలిగేది. అటువంటి సౌందర్యవంతుడు రాముడు. రాముడు ధర్మంగా మాట్లాడతాడు. దొంగతనం చేసారు అనుకోండి దొంగతనం చేసారు అని సమాజంలో చెప్పడు దొంగతనం చేసే గుణం పోగొడతాడు. అది నిజమైనా మీకు అప్రీతిగా ఉంటే చెప్పడు. అది ప్రీతిగా ఉంటే చెబుతాడు వాడు రాముడు.

సీతారాములు చిత్రకూటంలో రెండు నెలలు ఉన్నారు. అక్కడ మందాకినీ నది ప్రవహిస్తుంది. రోజూ సాయంత్రం సీతారాములు అక్కడ కూర్చునేవారు. ఈ నీళ్ళు ఎంత బావున్నాయి అంటుంది సీతమ్మ. నిజమే చాలా బావున్నాయి సత్పురుషుడి హృదయంలాగ ఉన్నాయి అన్నాడు రాముడు. అంటే సజ్జనుడి హృదయం కూడా అంత తేటగా ఉంటుంది అని చెప్పటం. రాముడికి మందాకినీ నది నీళ్ళు అంటే ఎంత ఇష్టము అంటే రోజుకి మూడుసార్లు స్నానం చేసేవాడు. రాముడు లక్ష్మణుడితో చెబుతాడు ఇక్కడ ఒక కుటీరం వెయ్యి అని. ఎక్కడ వెయ్యమంటారు అని లక్ష్మణుడు అడుగుతాడు. నువ్వే ఆలోచించి ఎక్కడ బావుంటే అక్కడ వేసేయి అంటాడు రాముడు. అప్పడే నన్ను అంత పెద్దవాడిని చేసేయవద్దు అన్నాడు లక్ష్మణుడు అది భక్తి. మీరు ఫలానాచోట కుటీరం వేయమంటే వేస్తాను నేను దానికి సరిపోతాను అన్నాడు లక్ష్మణుడు. రాముడిని మనం చూడటం కాదు ఆయన చేత మనం చూడబడాలి. రాముడేకాదు ఏ దేవతాపురుషుడు అయినా ఒక్కసారి ఆ కరుణామయుడి చూపు మన మీద పడింది అనుకోండి లైను అంతా క్లియర్ అయిపోతుంది. ఇంక ట్రాఫిక్ జామ్ ఉండదు. ఒక్కసారి ఆయన కరుణ, దయగల చూపు మన మీద పడితే మొత్తం లోపల గొడవ అంతా క్లియర్ అయిపోతుంది. పదివేల జన్మలు ఎత్తినా అది పొందలేము, అనుకొన్నది గురువు యొక్క దయవలన సడన్‌గా వెళ్ళి లోపల హృదయగుహలో పడిపోతుంది. గురువు మిమ్మల్ని ప్రేమిస్తాడు. వాడిమీద మీకు నమ్మకం కలిగిన తరువాత కోసేది కోసేస్తాడు, అంటే ఇది అంతా మనకి తెలియకుండా గురువు చేసుకుంటూ వెళ్ళిపోతాడు. మీరు శ్రవణం చెయ్యాలి. శ్రవణం చెయ్యటంకూడా సాధనలో ఒక భాగం. ఈ శబ్దాన్ని మీరు ధారణ చేస్తే ఎప్పటికైనా నిశ్శబ్దంలోకి తీసుకువెళుతుంది. శబ్దానికి కూడా శక్తి ఉంటుంది. మనం ధారణశక్తిని పెంచుకోవాలి. మనం విన్న మాటలని ధారణ చేస్తే, ధ్యానం చేస్తే అది కొంతకాలానికి మన సొంతం అవుతుంది. మీరు కంగారుపడి మనం పొందుతామా లేదా అని అలా అనుకోవద్దు. సందేహాలకి, అనుమానాలకి ప్లేసు ఇవ్వవద్దు. మీరు ఎప్పుడో కోటి జన్మలు తరువాత కూడా పొందలేము

అనుకున్నది ఇంకో గంటలో పొందవచ్చు. మీరు పొందలేము పొందలేము అని అస్తమానూ ఆ తలంపు పెట్టుకున్న మీకు పొందే పరిస్థితి వచ్చినప్పడు ఆ తలంపు అడ్డువస్తుంది, మీ ప్రోగ్రెస్ అంతా ఆపుచేసేస్తుంది, మీకు తరించే యోగ్యత లేకపోతే అసలు ఈ మార్గంలోకే రారు. మీరు అందరూ తప్పక తరిస్తారు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-01-2009, అమలాపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అబ్రహం లింకన్ ఏమి చెప్పాడు అంటే మీరు నెమ్మదిగా నడవండి, తొందరఏమీలేదు కాని మీరు వెళ్ళే డైరెక్షన్ సరిగా ఉందా లేదా అది చూసుకోండి అని చెప్పాడు. మనం కూడా ఏమి చేయాలి అంటే మనం వెళ్ళే మార్గం సరియైనదా, అది మనలను గమ్యానికి తీసుకొని వెళుతుందా లేదా అని ముందు మనం చూసుకోవాలి, మనం ప్రయాణించే మార్గం మనలను గమ్యానికి తీసుకొనివెళ్ళకపోతే శరీరానికి చెమట మిగులుతుంది, మనస్సుకు ఆయాసం మిగులుతుంది, అసలు సున్నా. మనం అందరం ఎక్కడ పొరపాటు పడుతున్నాము అంటే బయట ఏదో ఉంది, బయట ఏదో ఉంది అని అనుకుంటున్నాము. అసలు బయట జీవితం ఏమీ లేదు, మనం లోపల జీవితం బాగుచేసుకోవాలి. మీరు ఎవరైనా మంచి పని చేసారు అనుకోండి, మంచిపని చేసేవారు అందరూ గౌరవం కోసం చేస్తారు. గౌరవం దేనికి సంబంధించినది, అది బయటజీవితం. అదే మీరు ఈశ్వరప్రీత్యర్థం పనిచేసారు అనుకోండి, లోపలజీవితం బాగుపడుతుంది. మీరు మంచిపనులు చేయటం వలన ఎన్నిసార్లు మిమ్మల్ని ఊరేగించినా అల్లరి తప్పించి ఏమీ లేదు. మీ మనస్సు శాంతిగా లేదు అనుకోండి, బుద్ధి శుద్ధిగా లేదు అనుకోండి ఈ సన్మానాల వలన మీకేమీ మోక్షం రాదు, చివరికి అల్లరి మిగులుతుంది. మేము మంచి పనులు చేస్తున్నాము, సమాజంలో అందరూ గౌరవిస్తున్నారు అని మీరు అనుకొంటే ఇంక మీరు లోపలకు వెళ్ళలేరు. మీరు చాలా పైకివచ్చారు అని ఎవరైనా భగవాన్‌తో అంటే నేను పైకి వెళ్ళలేదు, నేను లోపలకు వెళ్ళాను అనేవారు. మీ అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ చెప్పాడు. కాని మనం అది మర్చిపోయి భగవంతుడికోసం ఎక్కడో బయట వెతుకుచున్నాము.

మనకు దేహం అనుభవంలో ఉంది, ఇంద్రియాలు అనుభవంలో ఉన్నాయి, కళ్ళతో చూడబడుతున్న ప్రపంచం కూడా అనుభవంలో ఉంది కాని మన హృదయంలో అంతర్యామిగా ఉన్న నారాయణుడు మనకు అనుభవంలో లేడు. ఆయన అనుభవంలో లేకుండా నేను మీకు

ఏదైనా ఒకమాట చెప్పినా అది మీకు పెద్దగా ఉపయోగపడదు, వినేవారిమీద ఆ మాటల ప్రభావం ఏమీ ఉండదు, మీరు మారుమనస్సు పొందలేరు. మీ లోపల జీవితం సరిగాలేనప్పుడు, మీకు ఏకాగ్రత లేనప్పుడు, పవిత్రత లేనప్పుడు మిమ్మల్ని అందరూ గౌరవించినా మీకు వచ్చేది ఏముంది? ఏమీ లేదు. మనం మార్గాన్ని తప్పిపోయాము. మనకు బోదకాలు ఉంది అనుకోండి, బోదకాలుని బలుపు అనుకుంటే ఎలాగ? మన జీవితాలు అలాగే ఉన్నాయి. మనం ఏ పని చేసినా నిర్మలంగా, నిశ్చలంగా చెయ్యాలి, ఈశ్వరుని దయను పొందటంకోసం చేయాలి. మనం మనస్సును ఎక్కడ పెట్టాలో అక్కడ పెట్టటంలేదు. శరీరం ఇక్కడ పనిచేస్తున్నప్పటికీ, మనస్సు ఎప్పుడూ ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టకూడదు. ఈశ్వరుని దయలేకుండా కేవలం మన తెలివితేటలవలన మనలో ఉన్న బలహీనతలలో నుండి మనం బయటకురాలేము. మన ఆలోచన సరిగా లేదు, మనం సరియైన మార్గంలో లేము అని మనకు తెలియటానికి కూడా ఈశ్వరానుగ్రహం లేకుండా అది మనకు తెలియదు. భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకొని మనం జీవించాలి. భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకోకుండా, మన ఇష్టప్రకారం నడుస్తూ ఉంటే, పడవలసిన మొట్టికాయలు నాలుగు పడ్డాక అప్పుడు గీతలో పరమాత్మ చెప్పిన మాటలు నిజం అనిపిస్తుంది, ఆ దెబ్బలు తింటేనేగాని మనకు బుద్ధిరాదు. ప్రపంచంలో అసలు దుఃఖస్పర్శలేని భోగం లేదు. అసలు పెళ్ళిళ్లే పెద్దమాయ. ఈ సృష్టి నడవటానికి భగవంతుడు పన్నిన పన్నాగం ఇది, భగవంతుడు వేసిన వల ఇది, ప్రతీ మనిషి ఆ వలలో పడిపోతాడు. సంసారంలో 10 పైసలు సుఖం ఉంటే, 90 పైసలు దుఃఖం ఉంది. అధికారంలో సుఖం ఉంది అనుకుంటారు, అధికారం వచ్చాక అందులో కూడా సుఖం లేదని అప్పుడు తెలుస్తుంది. మన స్వరూపంలో తప్పించి ఎక్కడా బయట సుఖం లేదు.

గీతలో భగవంతుడు ఏదైతే చెప్పాడో తూచా తప్పకుండా దానిని అనుసరించి మనం ప్రయాణం చేయాలి. ఎక్కడైనా మనం దానిని అతిక్రమిస్తే అది అంతా మరల అశాంతిగా మారిపోతుంది. మన దగ్గర ఉన్న డబ్బు, చదువు మనలను బాగపడనివ్వటంలేదు, మనలను చెడగొడుతున్నాయి. బాగా చుదువుకొన్నవారికి, బాగా డబ్బు ఉన్నవారికి తప్పనిసరిగా గర్వం వచ్చేస్తుంది. రామకృష్ణ పరమహంస ఏమి చెప్పారు అంటే మీకు పెద్ద డబ్బు ఉండనక్కరలేదు. మీ చుట్టాలు ఎవరైనా అయిదువేల రూపాయలు చీర ఇచ్చారు అనుకోండి, ఆచీర కట్టుకోండి, అప్పుడు మీకు ఏమనిపిస్తుంది అంటే నేనే కోటీశ్వరురాలిని అనిపిస్తుంది, మీకు గర్వం వచ్చేస్తుంది, అంతకుముందు ఉన్న భక్తి పోతుంది, ఆ చీరలోనే ఇంత మాయ ఉంటే ఇంక లోకంలో ఎంత

మాయ ఉందో అన్నాడు రామకృష్ణుడు. అందుచేత ఉపనిషత్‌లలో ఏమని చెప్పారు అంటే కత్తి అంచుమీద నడిచేవాడు ఎంత జాగ్రత్తగా ఉంటాడో ఆధ్యాత్మికమార్గంలో ఉన్నవాడు అంత జాగ్రత్తగా ఉంటేనే మాయను అతిక్రమించగలడు. ఒకోసారి మనం ఎవరికైనా వంకాయలు పంపుతాము అనుకోండి, వారు ఆ వంకాయలు తీసుకొని అందులో మిఠాయిగాని ఏదో ఒకటిగాని పెట్టి మనకు పంపిస్తారు. ఇక్కడ భగవాన్ ఏమంటున్నారు అంటే నా దగ్గర విషపు కప్ప ఉంది. విషం తింటే చనిపోతాను అని నువ్వు దానిని వంచేసావు. వంచేసి ఖాళీ కప్ప నాకు ఇవ్వకు, అందులో అమృతం పోసి ఇవ్వు అరుణాచలేశ్వరుడా అంటున్నారు. దాని అర్థం ఏమిటి అంటే నాలో చెడ్డఅలవాట్లు ఉంటే తీసేసి నాకు మంచిఅలవాట్లు నేర్పు, మంచిగుణాలు నాకు ఇయ్యి అని చెప్పటం.

మనకు మంచి కోరికలు ఉంటే మంచి జన్మలు వస్తాయి, చెడ్డ కోరికలు ఉంటే చెడ్డ జన్మలు వస్తాయి, ఏ రకమైన కోరిక ఉన్నా జన్మను తీసుకొని వస్తుంది. ఏ వాంఛ లేకుండా పని పనికోసమే చేస్తూ ఉంటే పనిద్వారా కూడా మీరు తరించవచ్చు. నిష్కామకర్మ మీరు అనుకొన్నంత తేలికకాదు, చేసేటప్పుడు అందులో ఉన్న కష్టం మీకు తెలుస్తుంది. నిజంగా మీరు నిష్కామకర్మ చెయ్యటం మొదలుపెడితే మీ మనస్సు కరిగిపోతుంది. మేము వారికి ఉపకారం చేసాము కాని వారు అపకారం చేస్తున్నారు ఏమిటి అంటారు అంటే మీరు ఉపకారం ఆశించి చేసినట్లుకదా, అది కూడా స్వార్థంతోటి చేసిన కర్మేకాని భగవంతుడి ప్రీతికోసం చేసిన కర్మకాదు. మీరు ఎవరికి ఏది చేసినా వాడిలో కూడా నారాయణుడు ఉన్నాడు, ఆయనను సంతృప్తి పరచటంకోసం పనిచేస్తే మీ శరీరం భూమిమీద తిరుగాడుతున్నప్పడే, ఈ జన్మలోనే మీరు మోక్షసుఖాన్ని పొందుతారు. మోహమూ మనలోనే ఉంది, సత్యము మనలోనే ఉంది. మోహాన్ని ఎవడైతే త్యాగం చేయగలుగుతున్నాడో వాడు సత్యాన్ని పొందుతాడు. మహాత్ముల దగ్గర, మహర్షుల దగ్గర కూర్చున్నప్పడు మనలోని వాసనలు అణిగిఉంటాయి, మనం సుఖాన్ని శాంతిని పొందుతాము. అవి మీ సొంతం కాదు, అవి సొంతం అనుకొంటే మరల ప్రమాదంలో పడతాము. మీరు ఇంటికి వెళ్ళిన తరువాత మరల మీ వాసనలు మీకు వచ్చేస్తాయి. కాని దాని వలన లాభం ఏమిటి అంటే అక్కడ కూర్చున్నప్పడు బాగానే ఉంది, ఇంటికి వచ్చాక పరిస్థితి బాగాలేదు, ఆయన సమక్షంలో సంసారంతో సంబంధంలేని శాంతిని, సుఖాన్ని అనుభవించాము, ఇది బాగుంది, మరల దానిని ఎలా పొందాలి అని మీరు ప్రయత్నం చేస్తారు, అది గురువు అనుగ్రహం. అందుచేత మహాత్ముల దర్శనం ఊరికేపోదు, మీరు ఉద్ధరించబడతారు.

ఈ మీటింగులు దేనికి? మీ సన్మానాలు, గౌరవాలు మాకు అక్కరలేదు. నాన్నగారు బాగానే చెప్పారు అంటే అలా అనుకునే మాటలవలన మీకు ఉపయోగంలేదు, మాకూ ఉపయోగంలేదు. మా హృదయంలో ఏదైనా శాంతిని ఎంజాయ్‌చేస్తూ ఉంటే, దైవం తాలుక సుఖాన్ని కొంతైనా అనుభవిస్తూ ఉంటే దానిని మీకు పంచిపెట్టటానికి తప్పించి ఈ మీటింగుల వలన ప్రయోజనం లేదు. స్వతంత్రమైన సుఖంగాని, శాంతికాని ఎంతోకొంత నాకు లేదు అనుకోండి నేను మాటలు చెప్పినా ప్రయోజనం లేదు. ఈ సభల వలన భగవంతుడిలో ఐక్యమవ్వటానికి తగిన మార్గం, సరళమైన మార్గం మీకు కనిపించటంలేదు అనుకోండి, ఎంతో కొంతశాంతి, సుఖం మీకు అందటం లేదు అనుకోండి ఈ మీటింగులు అనవసరం, మీరు ఇక్కడకు రావటం అనవసరం, మనకు బయట జీవితం తెలుస్తోంది కాని లోపల జీవితం తెలియటం లేదు. నేను లోపల చెడ్డ ఉద్దేశం పెట్టుకొని మీకు మంచి మాటలు చెప్పినా దానివలన ప్రయోజనం లేదు. ఎందుచేతనంటే నాలోపల జీవితం బాగాలేదు. ఒకోసారి ఇతరుల భావనాబలం మనకు చాలు, మనం బాగుపడాలి అని వారు నిజంగా అనుకొంటే, ఆ భావనాబలం ఉంటే ఆ వైబ్రేషన్స్ మన మీద పనిచేసి మనం బాగుపడతాము. మన పని మనం చేసుకోకుండా ఎవరో ఇతరుల మీద ఆధారపడతాము. మన పని మనం చేసుకోవటం కూడా నామోషీ అనుకొంటే దేవుని అనుగ్రహానికి ఎలా పాత్రులవుతాము. ఇలా సోమరితనానికి అలవాటు పడిన మనకు ఇహంలేదు, పరం లేదు. పొగ ఎక్కువ ఉన్నచోట నిప్పు ఎలా కనబడదో అలాగ కామంతో నిండిన నీ బుద్ధికి భగవంతుడిని తెలుసుకొనేదారి కనబడదు. కామం ఇంద్రియాలలో, మనస్సులో, బుద్ధిలో అంతటా వ్యాపించి ఉంది. కామం నీకు శత్రువు కాదు, బుద్ధిమంతులకు, సాధకులకు కామం శత్రువు. రజోగుణం ఉన్నవారికి, సత్వగుణం ఉణ్ణవారికి కామం శత్రువుకాదు, సత్వగుణం ఉన్నవారికి మాత్రమే అది శత్రువు..

మనం భగవంతుడిని ఏదీ అడగకూడదు. ఎందుచేతనంటే మనకు ఏది అవసరమో మనకంటే ఆయనకు బాగా తెలుసు. అందుచేత అది కావాలి, ఇది కావాలి అని భగవంతుడిని అడగటం మానేసి నీ దయ కావాలి అని అడిగితే మనకు ఏది మంచిదో, మనకు ఏది ఎప్పుడు ఇవ్వాలో ఆయనే నిర్ణయించుకొని ఇస్తాడు. మీకు ఏ పనులు ఎప్పుడు జరగాలో అప్పుడు జరుగుతాయి. కాని తొందరపడటం వలన జరగవు. జరిగేది అంతా ఈశ్వరసంకల్పంతోటి నడుస్తోంది, ఇది తెలుసుకోవటం కావాలి. ఇది తెలిస్తే సుఖం, తెలియకపోతే దుఃఖం. మనం గుడుల చుట్టూ తిరగవచ్చు, గుడికి వెళ్లటం ఎందుకు అంటే ఆ గుడిలో ఉన్న దేవుడు మన

హృదయంలో కూడా ఉన్నాడని తెలుసుకోవటానికే. లోపల ఉన్న సత్యం మనకు తెలుస్తూ ఉంటే మన దేహమే దేవాలయం అవుతుంది. మనం నిద్రలో శాంతిగా ఉన్నాము, మెలకువ వచ్చేటప్పటికి ఇంత అశాంతి వచ్చేస్తోంది ఏమిటి అని మనకు అనిపిస్తూ ఉంటుంది. మెలకువ వచ్చేటప్పటికి మొదట మనకు నేను అనే తలంపు వస్తుంది, అదే సైతాను, మన అశాంతికి, దుఃఖానికి అదే కారణం. అది దేహంతో తాదాత్మ్యం పొందుతుంది. ఆ తలంపులో నుండే ఇతర తలంపులు వస్తాయి. దేహవాసన మనిషిని పీడించేస్తుంది. మీరు దేనిగురించి బెంగపెట్టుకోవద్దు. మనం ఇతరులను హింసపెట్టటం ఎంతపాపమో మనలో ఉన్న జీవుడిని హింస పెట్టటం కూడా అంతే పాపం. ఎందుచేతనంటే ఈ జీవుడు కూడా నారాయణుడి యొక్క అంశే. కబీరు ఏమి చెప్పాడు అంటే మనం పుట్టినప్పుడు ఏడుస్తాము, ఇంట్లోవారు సంతోషిస్తారు. నువ్వు చనిపోయేటప్పుడు ఏడుస్తూ చనిపోయేబదులు సంతోషంగా, శాంతిగా చచ్చిపో, ఇంట్లోవారు ఏడ్చేదేదో ఏడుస్తారు, గొడవ వదిలిపోతుంది అన్నాడు. మన ఇంట్లోవారి ప్రేమలు కూడా నిజం కాదు, అది కూడా అహంకారంతోటి కూడినదే.

సత్వగుణం ఉన్నవాడికి మనస్సు ఉంటుంది, దానిని అరూపమనస్సు అంటారు. అది నామ రూపాలను పట్టుకోదు. సత్వగుణం ఉన్నవాడు నామాన్ని పట్టుకోడు, రూపాన్ని పట్టుకోడు, వాడు చేసేది చేసేస్తూ ఉంటాడు, వాడి వెనకాల దుమ్ము ఏమీ ఉండదు. రజోగుణం వెనకాల, తమోగుణం వెనకాల దుమ్ము ఉంటుంది, మీరు రూపాన్ని, నామాన్ని దృష్టిలో పెట్టుకొని పనులు చేస్తారు. మీరు ఏ పని చేసినా నామరూపాలను దృష్టిలో పెట్టుకొని చేయవద్దు, అందరిలోను అంతర్యామిగా నారాయణుడు ఉన్నాడు, వాడిని దృష్టిలో పెట్టుకొని చెయ్యండి. మీరు ఎవరికైనా పది రూపాయలు ఇచ్చారు అనుకోండి, ఏదైనా సహాయం చేసారు అనుకోండి, నేను వారికి సహాయం చేసాను నన్ను వదిలేసారు అంటే అది నిష్కామకర్మ ఎలా అవుతుంది. వారి దగ్గర నుండి లోపల నీవు ఏదో ఆశిస్తున్నావు కదా, ఇవన్నీ కామ్యకర్మలే. ఎవడో ఈశ్వరుడి దయను పొందినవాడు నిష్కామకర్మ చేయగలడు కాని మామూలుగా జీవకోటి అందరూ కామ్యకర్మలే చేస్తారు, ఈ కామ్యకర్మల వలన పునర్జన్మలు వస్తాయి. మనకు డబ్బు కాంక్ష కీర్తి కాంక్ష ఇలా చాలా కాంక్షలు ఉన్నాయి, మంచితలంపులు, చెడు తలంపులు ఉన్నాయి. కాని మానవ స్వభావంలో దేహము నేను అనే తలంపు ఉన్నంత లోతుగా ఏ తలంపు ఉండదు. పైగా దీని అందానికి గౌరవాలు కావాలి, సన్మానాలు కావాలి, స్వర్గానికి వెళతాను అంటుంది, అన్ని గొడవలు దానికే కావాలి. అందుచేత భగవాన్ ఏమి చెప్పారు అంటే నేను అనే తలంపు ఉంటే అంతా

ఉంది, అది లేకపోతే ఏదీ లేదు అన్నారు. అంటే అది కల్పించినదంతా పోతుంది, నువ్వు మిగులుతావు, నువ్వు ఏదిగా ఉన్నావో అది నీకు తెలుస్తుంది.

ప్రారబ్దం యొక్క వేగం గట్టి దెబ్బలు కొట్టేస్తూ ఉంటుంది. ఏమండీ ఈ బాధలు భరించలేకపోతున్నాము బయట చూస్తే అప్పల గొడవ, ఇంట్లో చూస్తే కొడుకులు, కోడళ్ల గొడవ అని కొంతమంది అంటారు. శరీరం మీద నిప్ప రవ్వ పడితే ఎంత బాధగా ఉంటుందో అలాగ ప్రారబ్దం కొట్టే దెబ్బలు మనస్సును కాల్చేస్తూ ఉంటాయి. అప్పుడు మనం వాటిని తట్టుకోవాలి. అప్పుడు గబుక్కొని ఎండ్రిన్ తాగి చనిపోతే ఇంకా చెడ్డ జన్మలు వస్తాయి. మీరు ఎంతమంచివారు అయినా ఒకోసారి మీ భర్తలు మిమ్మల్ని బాధలు పెడుతూ ఉంటారు, భర్తలు మంచివారు అయినా భార్యలు బాధలు పెట్టేవారు ఉన్నారు. అదొకరకమైన ప్రారబ్దం. ఆ ప్రారబ్దం కొట్టే దెబ్బలు, వాటి బాధ అనుభవించేవారికి తెలుస్తుంది కాని బయటవారికి ఏమి తెలుస్తుంది, ప్రారబ్దం మిమ్మల్ని దెబ్బలు కొట్టేటప్పుడు సాధ్యమైనంత వరకు మనస్సును నిర్మలంగా ఉంచుకొని, నారాయణ స్మరణ చేసుకోండి. మన దేహప్రారబ్దంలో ఉన్నదే మనకు వస్తోందికాని లేనిది ఏమీ రావటం లేదు, దీనికి ఇతరులను అనుకోవటం అనవసరం. అందుచేత ప్రారబ్దాన్ని సుఖంగా, శాంతిగా అనుభవిస్తే వచ్చే జన్మలు తగ్గిపోతాయి. తల్లి కడుపులో నుండి బయటకు వచ్చినది మొదలు స్మశానంకు వెళ్లేవరకు ఎవడి జీవితం సమానంగా వెళ్లదు, అనేక హెచ్చుతగ్గులు ఉంటాయి. మాకు 90 ఏళ్లు వచ్చినాయి, రోజులు బాగానే వెళ్లిపోతున్నాయి అని అనుకోవద్దు. ఇంకా బతికిన రోజులలో ఎంత ప్రారబ్దం అనుభవించవలసి ఉంటుందో మనకు తెలియదు. అందుచేత ఈ ముక్కులో గాలి బయటకు పోయేవరకు ఏదీ అనుకోవటానికి వీలు లేదు. ప్రతీమనిషికి నేను, నాది అనే తలంపులు ఉంటాయి. ఈ రెండు తలంపులలో నుండి బయటకు రాకపోతే మీకు వందకోట్లు డబ్బు ఉన్నా మీకు పునర్జన్మ తప్పదు, అశాంతి తప్పదు, దుఃఖం తప్పదు.

కొంతమందికి ఎంత డబ్బు ఉన్నా సంతృప్తి ఉండదు. ఆ అసంతృప్తిలో నుండి దుఃఖం వస్తుంది. ఇంగ్లీషులో ఒక సామెత ఉంది. ఒకడికి కాళ్లు ఉన్నాయి, వాడు రోజూ నాకు బూట్లు లేవు, బూట్లు కొనుక్కోవటానికి నా దగ్గర డబ్బులు లేవు అని బాధపడుతూ ఉండేవాడట. ఒకసారి వాడు రెండుకాళ్లు వంకరగా ఉన్నవాడిని చూసాడట, వాడు కర్ర ఉంటే నడవగలడు, కర్ర లేకపోతే నడవలేడు. కాళ్లు సరిగాలేనివాడిని బూట్లులేవని బాధపడేవాడు చూసి అయ్యోవాడికి కాళ్లు లేవు, భగవంతుడు నాకు కాళ్లు ఇచ్చాడు. భగవంతుడు నాకు కాళ్లు ఇచ్చాడు అని సంతోషించటం మానేసి బూట్లు లేవని ఏడుస్తున్నాను, ఇంక ఇలా బూట్లు లేవని ఏడవను, కాళ్లు ఇచ్చినందుకు

సంతోషిస్తాను అని దేవుడికి కృతజ్ఞత చెల్లించుకున్నాడు. ప్రారబ్ధం కొట్టే దెబ్బలకు కంగారుపడకండి. చెడు ప్రారబ్ధం నిజంకాదు, మంచి ప్రారబ్ధం నిజంకాదు. మీ దేహం ఎంత నిజమో ఆ ప్రారబ్ధం కూడా అంతే నిజం. అందుచేత ప్రారబ్ధం పెద్ద పెద్ద మొట్టికాయలు కొట్టేసినా, దానివలన మంట వచ్చినా ప్రారబ్ధాన్ని శాంతిగా అనుభవిస్తే, దానిని ఎంజాయ్ చేస్తే రాబోయే జన్మలు పోతాయి. అద్దంలో చూసుకుంటే మీ ప్రతిబింబం కనిపిస్తుంది. ఆ ప్రతిబింబం మీదే అయినా ఆ ప్రతిబింబం మీరు కాదు. అలాగే మీకు కనిపిస్తున్న ఈ ప్రపంచం అంతా భగవంతుడి యొక్క నీడ. అద్దంలో కనబడే ఆ ప్రతిబింబం ఎంత నిజమో భగవంతుడి షాడో అయిన ఈ ప్రపంచం కూడా అంతే నిజం. ఆ ప్రతిబింబం నిజం కాకపోయినా ఆ ప్రతిబింబం నాదే అని మీరు ఎలా చెప్పకొంటారో అలాగే ఈ ప్రపంచం అంతా భగవంతుడిదే. మీ ఫొటోను ఎవరైనా కొడితే మీకు దెబ్బలు తగలవుకాని మీరు బాధపడతారు. అలాగే ఈ ప్రపంచాన్ని ఎవరైనా అవమానపరిస్తే నాకే అవమానం చేసారు అని భగవంతుడు అనుకుంటాడు, అందువలన బహుజాగ్రత్తగా జీవించాలి.

నేను వారికి ఉపకారం చేసాను, వారిని ఉద్ధరించాను అని అనుకోవద్దు. అది పూజ అనుకోండి, ఎందుచేతనంటే అంతా భగవంతుడే. ఆధ్యాత్మిక జీవితంలో పోగొట్టుకొనేదేకాని సంపాదించేది ఏమీలేదు మీరు పోగుజేసుకోవటం అనవసరం. మీకు సంబంధంలేని గొడవలు పోగొట్టుకొంటే సరిపోతుంది. అక్కరలేని గొడవలు అన్నీ పోగుజేసు కొన్నారు ఇప్పడు అక్కరలేని గొడవలు వదిలేయటమే సాధన. ప్రారబ్ధాన్ని శాంతిగా, సుఖంగా అనుభవించండి. మీ ఇంట్లోవారు ఎవరైనా మంచిమార్గంలో లేకపోతే వారి గురించి దుఃఖపడవద్దు, వారు బాగుపడాలని, వారికి మంచిబుద్ధిని ప్రసాదించమని భగవంతుడిని ప్రార్థించండి. దుఃఖపడటంకంటే భగవంతుడిని ప్రార్థించటం మంచిది. వారు బాగుపడాలని మీరు హృదయపూర్వకంగా భగవంతుడిని ప్రార్థిస్తున్నారు అనుకోండి, ఆ ప్రభావం వారిమీద పడి వారు బాగుపడతారు. మీకు ఏదైనా శక్తి ఉన్నా ఎవరికీ అపకారం చేయవద్దు, చేతనైతే ఉపకారం చేయండి లేకపోతే ఊరక ఉండండి. ఊరక ఉండటం నేర్చుకుంటే ఎదుటివారి మనస్సుకు అందని ఉపకారం చెయ్యవచ్చు. నేను ఎవరికైనా నాలుగు పళ్ళు ఇచ్చాను అనుకోండి, నాన్నగారు నాకు పళ్ళు ఇచ్చారు అనుకొంటారు. మేము ఊరక ఉండటం నేర్చుకొన్నాము అనుకోండి, మా ద్వారా మీ మనస్సుకు, మీ ఇంద్రియాలకు అందని శాంతి మీకు అనుభవంలోనికి వస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఏప్రియల్ | 6 | మండపేట, సీతారామ కళ్యాణ మండపం, ధర్మగుండం చెరువు దగ్గర |
| ఏప్రియల్ | 9 | భీమవరం, సి.ఎస్.ఆర్. జూనియర్ కళాశాల, సూర్యనారాయణపురం వంశీకృష్ణా నగర్, అడ్డ వంతెన దగ్గర, జె.పి. రోడ్ |
| ఏప్రియల్ | 27 | హైదరాబాద్, వేణుగోపాలస్వామి గుడి, గోవర్ధనగిరి, మలేషియా టౌన్ షిప్ ఎదురుగా, కుకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ |
| మే | 10 | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |

# ప్రయత్నమే - సాధన

ఆధ్యాత్మిక ప్రగతిలో అడ్డు నిలిచే మనస్సు యొక్క ఆలోచనలు చెదపురుగుల గుంపుగా బయలుదేరి ముసరటంతో మనం నిరాశ చెంది సాధన మానేద్దామని అనిపిస్తుంది. అప్పుడు గురు అనుగ్రహం చాలా అవసరం. గోడలోకి బలంగా కొట్టిన మేకు చిటికనవేలుతో కదిపితే బయటకు రాదు. ఎన్నో వేల జన్మల నుంచి బహు ఇష్టంగా చేసిన క్రియలు సంస్కారాలుగా మారినవి తేలిక ప్రయత్నంతో పోవు. అజాగ్రత్త, అశ్రద్ధ, నిరాశవల్ల సహజశాంతిని పోగొట్టుకొంటున్నాము. పనిచేసే శక్తి, ప్రేమించే శక్తి సంపాదించుకోవాలి. ఊరికే ఉండటానికి ప్రయత్నం చేస్తే అన్నీ చేసినట్లే. కాని మనం దుఃఖాలను, బాధలను పట్టుకొని వేళ్ళాడుతున్నాము. అవి ఏవో అపూర్వమైనట్లు, తొలగనట్లు మనకు ఆలోచనలు మొలకెత్తినప్పడే దాన్ని గమనించగల ఎరుక మనలో ఉండాలి. దానికి అభ్యాసం, సాధన కావాలి. ఆలోచనల స్వభావాన్ని ఎలా అంకురిస్తున్నాయి, ఏలా రూపొందుతున్నాయి, ఎలా స్థిరపడుతున్నాయి, ఎలా అంతమౌతున్నాయి. అవి అతిథిలా వచ్చి కాసేపు ఉండి వేళకాగానే మనలను వదలి వెళ్లిపోతూ ఉంటాయి. వాటికి మనం ఆతిధ్యం ఇయ్యకూడదు. సరళంగా ఉన్న ఆచోచనలతోనే తొలి ప్రయత్నం ప్రారంభిస్తే సానుకూల ఫలితాలు ఉంటాయి. అదే సాధనా క్రమం. మన ఆలోచనలు పుంఖానుపుంఖాలుగా వస్తూ ఉంటాయి. ఉదాహరణకు మనం పార్కులో ఏకాంతంగా కూర్చుని ఉంటే దగ్గరలో కుక్క మొరిగితే బాల్యంలో మనం పెంచిన కుక్క మరణం గుర్తుకు వస్తుంది. మనం ఆ తలంపుతో బాధపడతాము తరువాత తల్లి మరణం, తండ్రి మరణాలు గుర్తుకు వస్తాయి. వాటి సంఘటనల్లో పడ్డ బాధలు గుర్తుకొస్తాయి. బాధపడతాము. ఇది ఒక కుక్క మొరిగిన ఫలితంగా ఏర్పడ్డ ఆలోచనా ప్రవాహము. చివరకు అవి అంతమౌతాయి. అన్ని ఆలోచనా క్రమాలు ఇలాగే ఉంటాయి. దాన్ని గుర్తించి ఆపుచేయటమే సాధన. శ్రీనాన్నగారు “మీ సాధనలో వాసనలు పోగొట్టుకొనే ప్రయత్నములో నిజాయితీ ఉంటే అది నిజమైతే ఈశ్వరానుగ్రహం వల్ల వాసనలు తప్పక పోతాయి, శాంతి లభిస్తుంది” అన్నారు. శ్రమలోనే ఆనందం ఉంది. సాధకుడు తనకున్న సంసార బాధలను పట్టించుకోకూడదు. సమయానికి పని చేయటమే సాధనలో అసాధ్యమంటూ ఏదీ లేదు. మన శ్రమే అనుగ్రహంగా తిరిగి వస్తుంది జీవితం సఫలమౌతుంది.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్ధవరం



**సద్గురు శ్రీ నాన్నగారితో ఆంధ్రాలో అరుణాచల దేవాలయం నిర్మిస్తున్న శ్రీరామస్వామి**

# నిజమైన అభివృద్ధి

మనస్సు యొక్క చాపల్యం తగ్గి అంతర్ముఖమవ్వడమే ఆధ్యాత్మిక అభివృద్ధికి గుర్తు. మనలోని వాసనల ప్రభావాలు ఎల్లప్పుడు బహిర్ముఖమయ్యే మనస్సు నేనెవరు? అను విచారణ వల్ల అంతర్ముఖమవుతుంది. సాధనా పరమైన ఆటంకాలు వాస్తవంగా బయటలేవు, మన లోపలే ఉన్నాయి, అవే మన వ్యతిరేక భావనలు, మానసిక అలజడి, నిరుత్సాహము మున్నగునవి. కాబట్టి నేనెవరనే విచారణ నిరంతరం విసుగు లేకుండా ప్రీతిగా, శ్రద్ధగా చెయ్యాలి. నేనెవరు? అను విచారణ ద్వారా విజయం తథ్యమని భగవాన్ శ్రీ రమణులచే హామీ ఇవ్వబడింది. మన స్వరూపం బ్రహ్మమే అయినప్పటికీ దేహాత్మ బుద్ధివలన అశాంతికి, దుఃఖానికి లోనవుతున్నాము. నేనెవరను విచారణ ద్వారా మనకు ఎదురయ్యే అవాంతరాలను అధిగమిస్తే మన స్వస్థితి అనుభవంలోనికి వస్తుంది. సద్గురు కృప నిరంతరం ఉండేదే! మన శ్రద్ధ, విచారణ ఎంత ఎక్కువగా ఉంటే అంత త్వరగా స్వరూప జ్ఞానంలోకి మేల్కొంటాము.

**- చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం**